### జవహర్‌నగర్ వ్యర్థాల నిర్వహణకు..
## 'ఐఐటి-బొంబాయి' సేవలు
### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జవహర్ నగర్‌లోని మున్సిపల్ ఘన వ్యర్థాల ప్రాసెసింగ్, పారవేసే కేంద్రం (ఎంఎస్‌డబ్ల్యు) వద్ద సాంకేతిక సలహాలు, సంప్రదింపుల కోసం ఐఐటిబొంబాయి (ట్రిబుల్ ఐటి బొంబాయి) సేవలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సాంకేతిక సలహా సేవల ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.1.99 కోట్లు కేటాయించింది. రెండేళ్ల పాటు ఐఐటిబొంబాయి నిపుణులు ఈ ప్రాజెక్టుపై పర్యవేక్షణ చేయనుంది. జవహర్ నగర్ యార్డ్ వల్ల చుట్టుపక్కల గ్రామాల కాలుష్యానికి గురవుతున్నాయని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి) లో దాఖలైన కేసు విచారణలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్‌జిటి ఆదేశాల మేరకు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి), ఐఐటిబొంబాయి నిపుణులతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఒప్పందంలో భాగంగా ట్రిబుల్ ఐటి బాంబే స్వతంత్ర సాంకేతిక పర్యవేక్షణ, పర్యావరణ మానిటరింగ్ నిర్వహించనుంది. లీచేట్ నిర్వహణ, భూగర్భజలాలు, గాలి నాణ్యత, వర్షపు నీటి ప్రవాహ వ్యవస్థలపై అంచనాలు వేయనుంది. అలాగే ఘన వ్యర్థాల ప్రవాహాన్ని తగ్గించే విధానాలు, వికేంద్రీకరణ చర్యలు, లెగసీ వేస్ట్ బయోమైనింగ్ సాధ్యతపై శాస్త్రీయ అధ్యయనాలు చేయనుంది. అవసరమైతే అమలు దశలో అవసరమైన సాంకేతిక మార్గదర్శకతను కూడా ట్రిబుల్ ఐటి బాంబే అందించనుంది. జవహర్ నగర్ పరిసర ప్రాంత ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని, శాస్త్రీయ పద్ధతిలో కాలుష్య నివారణ లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది.

## డోర్నకల్ - గద్వాల కొత్త రైల్వే లైన్ సాధనకు పాదయాత్ర
### ఎంపి డాక్టర్ మల్లు రవి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డోర్నకల్ –గద్వాల కొత్త రైల్వే లైన్ సాధనకు త్వరలో పాదయాత్ర చేపట్టనున్నట్లు నాగర్‌కర్నూల్ ఎంపి డా.మల్లు రవి ప్రకటించారు. నాగర్ కర్నూల్ పూర్తిగా వెనుకబడ్డ ప్రాంతం అని రైల్వే నెట్‌వర్క్ ఎంతో అవసరం ఉందని వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీ లోని తెలంగాణ భవన్‌లో ఎంపి మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తి మాచర్ల రైల్వే లైన్ ఏర్పాటు చేస్తే రెండు తెలుగు రాష్ట్రాలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. తను మూడో సారి ఎంపి అయిన తర్వాత డోర్నకల్ నుంచి గద్వాల వరకు కొత్త రైల్వే లైన్ గురించి ప్రతి పార్లమెంట్ సెషన్‌లో మాట్లాడుతూనే ఉన్నానని, మంత్రులు, సీఎం రేవంత్‌రెడ్డి ద్వారా రైల్వే మంత్రికి లేఖ రాయించినట్లు తెలిపారు. ఈ రైల్వే లైన్ నాగర్ కర్నూల్ జిల్లాకి లైఫ్ లైన్ లాంటిదని, ఈ లైన్ రావడం వల్ల నాగర్ కర్నూల్ పార్లమెంటు రైల్వే నెట్వర్క్ కనెక్ట్ అవుతుందన్నారు. రైల్వే బోర్డ్ డైరెక్టర్ అఖిలేశ్‌ను కలిసి.. ఈ రైల్వే లైన్ కోసం సర్వే చేసిన మ్యాప్ ని, సౌత్ సెంట్రల్ రైల్వే ద్వారా రైల్వే బోర్డు పంపించిన డీపీఆర్‌ను తీసుకున్నామని తెలిపారు.. వారం, పది రోజుల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ట్రాఫిక్) ,మిగిలిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ సమావేశం నిర్వహించి పూర్తిస్థాయి డిపిఆర్ సిద్ధం చేసి.. క్యాబినెట్‌కు పంపించే ప్రక్రియను మొదలు పెడతామని రైల్వే బోర్డు డైరెక్టర్ హామీ ఇచ్చారని మల్లు రవి తెలిపారు.

### ఆర్‌టిసిలో దశలవారీగా
## ఎలక్ట్రిక్ బస్సుల అమలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి)లో ఎలక్ట్రిక్ బస్సుల (ఈవి) ను దశలవారీగా అమలు చేసే చర్యలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ (జిహెచ్‌జెడ్)లో సిబ్బంది స్థితిగతులను సమీక్షించిన అధికారులు, డ్రైవర్లు, మెకానిక్‌లు, హెల్పర్లు, శ్రామికులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై ఫిబ్రవరి 23న జరిగిన సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైదరాబాద్, కరీంనగర్ జోన్‌లలో అవసరాల మేరకు సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపేందుకు ప్రాంతాల వారీగా అప్షన్ కోరాలని నిర్ణయించారు.

**ప్రధాన అంశాలు:** గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు చెందిన డ్రైవర్లు, మెకానిక్‌లు, హెల్పర్లు, శ్రామికులు హైదరాబాద్, కరీంనగర్ జోన్‌లలో పనిచేయడానికి ఆసక్తి ఉన్న దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌టిసి ఆదేశించింది. 10వ తరగతి లేదా అంతకంటే ఎక్కువ అర్హత కలిగిన డ్రైవర్లు, కండక్టర్ పోస్టులకు రీకేటగిరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. మెకానిక్‌లు, ఎడిసిలు, బస్ పాస్ కౌంటర్లు, పార్కింగ్ డ్రైవర్లుగా పనిచేయడానికి కూడా అవకాశం (హెవీ వాహన డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారికి ప్రాధాన్యం) కల్పించబడుతుంది. సంబంధిత వివరాలను ఏప్రిల్ 15వ తేదీ లోపు సమగ్రంగా సమర్పించాలని ఆదేశించించారు.

## జిహెచ్‌ఎంసిలో డిప్యూటీ కమిషనర్ల బదిలీ
### కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఉత్తర్వులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో పరిపాలనాపరమైన కారణాలతో పలువురు ఉన్నతాధికారులను బదిలీ చేస్తూ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణమే ఈ బదిలీలు అమలులోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు. తాజా ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన అధికారులు వి. సమ్మయ్య ప్రస్తుతం అత్తాపూర్ (సర్కిల్20) డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈయనను బదిలీ చేసి, బడంగ్‌పేట (సర్కిల్16) డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఎల్.పి. మల్లయ్య జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో జాయింట్ కమిషనర్ (ఎన్నికలు)గా ఉన్న ఈయనను అత్తాపూర్ (సర్కిల్20) డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే తమ బాధ్యతలను అప్పగించి, కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని, అందుకు సంబంధించిన నివేదికను సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్
## రెండు రోజులు జిల్లాల పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్ కుమార్ గౌడ్ నేటినుంచి జిల్లా పర్యాటనలు చేపట్టనున్నారు. రెండు రోజుల పాటు 4జిల్లాల్లో పర్యటించనున్న మహేశ్ కుమార్ గౌడ్ గౌడ్.ఆయా జిల్లాలలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ ని మరింత విస్తృతం చేసే కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశనం చేయనున్నారు. ఇందులో భాగంగా వివిధ డిసిసిలతో ఆయన సమావేశం కానున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి అధ్యక్షతన జరగనున్న మంచిర్యాల జిల్లా కార్యవర్గ సమావేశానికి టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వివేక్, ఎంఎల్‌ఎ ప్రేమ్ సాగర్ రావు హాజరు కానున్నారు. అనంతరం అసిఫాబాద్ పర్యటనకు వెళ్లనున్నారు. అక్కడ డిసిసి అధ్యక్షులు ఆత్రం సుగుణ అధ్యక్షతన సమావేశంలో పాల్గొంటారు. శనివారం డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ అధ్యక్షతన ఆదిలాబాద్ జిల్లా డిసిసి కార్యవర్గ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొనున్నారు. అనంతరం డిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌ఎ వెడ్మ బొజ్జు అధ్యక్షతన జరగనున్న నిర్మల్ డిసిసి కార్యవర్గ సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ హాజరు కానున్నారు.

### 2వ దశలో 45రోజుల తర్వాత
# జిల్లాకో మండలంలో సమీకృత భూభారతి

### ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో పూర్తిస్థాయి సర్వే వీలైనంత త్వరగా సాదాబైనామాలకు పరిష్కారం



**ప్రజాపక్షం/రంగారెడ్డి/కడ్తాల్ :** రాష్ట్రంలో ల్యాండ్,సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించి తర్వాత అవసరమైన మార్పులు, చేర్పులతో జిల్లాకొక మండలంలో ప్రవేశపెడతామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని విఠాయిపల్లి గ్రామంలో జరిగిన వార్డు సభలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో గురువారం ఆమనగల్ మండలంతోపాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట,సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణ పేట జిల్లా కొస్గి మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు.ఏ పేదోడు ఏ ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు ఏ అధికారి దగ్గరికి వెళ్లి ప్రాధేయపడవలసిన అవసరం లేదు తన చేతిలో ఉన్న స్మార్ట్ ఫోన్ తో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ లో లాగిన్ అయితే అన్ని సేవలు లభిస్తాయని అన్నారు. గత ప్రభుత్వ పాలకులు ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో 9.52 లక్షల సాదాబైనామా దరఖాస్తులకు దిక్కులేకుండా పోయిందని ఇప్పుడు ఈ పేదల ప్రభుత్వం దీనిపై దృష్టి సారించిందని తెలిపారు. సాగుచేస్తూ, వారి అధీనంలో ఉండే భూములకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద కన్సెంట్ తీసుకొని వారికే భూమి పట్టాను ఖరారు చేస్తామని దీనికోసం వారం రోజుల క్రితం భూభారతిలో సవరణ చేస్తూ జీవో జారీ చేశామని వెల్లడించారు. అంతేగాక గతంలో గ్రామంగా ఉండి ఇప్పుడు మున్సిపాల్టీగా మారిన ప్రాంతాలకు ఈ సాదాబైనామాలు వర్తించేలా చేస్తామని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ప్రజల కోసం తమ రెవెన్యూ శాఖలో గణనీయమైన మార్పులు తెస్తున్నామని దీనిలో భాగంగా అక్రమాల ధరణిని చెప్పినట్లే బంగాళాఖాతంలో కలిపి భూభారతి తెచ్చామని, ఆధార్ నెంబర్‌లా ప్రతి భూమికి భూధార్ నెంబర్‌ను కేటాయిస్తామని చెప్పారు. అంతేగాక రాష్ట్రంలో 10.984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జిపిఒ లను నియమించడం జరిగింది. 5300 మందికి రెండు విడతల్లో ఆరునెలల పాటు శిక్షణ ఇచ్చి మండలానికి 4 నుంచి 6 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని తెలిపారు. సర్వే విషయంలో కూడా పాత పద్ధతులకు స్వస్తి పలికి ఇప్పటికే 411 రోవర్లతో కచ్చితమైన సర్వే చేయిస్తున్నామని,త్వరలో మరో 400 రోవర్లు రాబోతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం,తహశీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో తాను శంకుస్థాపన చేస్తానని మంత్రి పొంగులేటి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి,రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్‌కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి,జిల్లా అధికారులు,ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పిజి, డిప్లొమా వైద్యులకు 'ప్రభుత్వసేవ'తప్పనిసరి

### ఉల్లంఘిస్తే రూ.20 లక్షల జరిమానా ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలపై నిషేధం మార్గదర్శకాలు విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిగ్రీ, డిప్లొమా, సూపర్ స్పెషాలిటీ పూర్తి చేసిన వైద్యులు తప్పని సరిగా 12 నెలల పాటు 'ప్రభుత్వ సేవ' చేయాలని డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.20లక్షల వరకు జరిమానా విధించడంతో పాటు వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలపై కూడా నిషేధం విధించనున్నారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ గురువారం ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాలను అన్ని మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు తప్పకుండా అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పిజి, డిగ్రీ, డిప్లొమా, సూపర్ స్పెషాలిటీ పూర్తి చేసిన వైద్యుల సేవా కాలంలో సెలవులు, పొడిగింపు, 'బాండ్ నిబంధనల'పై మార్గదర్శకాలలో స్పష్టతను ఇచ్చింది. పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చిన తేదీ నుంచి సాధారణంగా 12 నెలలోపు తప్పనిసరిగా ప్రభుత్వ సేవ పూర్తి చేయాలని డిఎంఇ స్పష్టం చేసింది. ఒక వేళ పీజీ కోర్సు పూర్తి చేయడంలో ఆలస్యం జరిగితే, కోర్సు పూర్తయిన తేదీ నుంచి ఈ 12 నెలల గడువును లెక్కిస్తారు. ప్రభుత్వసేవలో భాగంగా కేవలం 20 రోజులు మాత్రమే సెలవులను ప్రకటించింది. వైద్యులకు డ్యూటీ వారాంతపు సెలవుతో పాటు మొత్తం 20 రోజుల క్యాజువల్ లీవులు మాత్రమే ఉంటాయి. దీనికి మించి ఇతర ఎలాంటి సెలవులు మంజూరు చేయబోమని డిఎంఇ స్పష్టం చేసింది. అయితే 20 రోజుల క్యాజువల్ లీవులకు మించి అదనపు సెలవులు లేదా సేవా కాలం పొడిగింపు కేవలం గర్భధారణ/మాతృత్వ కారణాలపైనే ఇస్తామని ఆ మార్గదర్శకాల్లో పొందుపర్చారు. సెలవుల పొడిగింపు అంశాన్ని సంబంధిత మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్స్ పరిశీలించి, డిఎంఇకి ప్రతి పాదించనున్నారు. అయితే సెలవుల పొడిగింపు పొందిన అభ్యర్థులు కూడా గరిష్ఠంగా 18 నెలల లోపు తమ తప్పనిసరి 'ప్రభుత్వ సేవ' కాలాన్ని పూర్తి చేయాలనే నిబంధనను విధించారు.

**బాండ్ ఉల్లంఘనకు భారీ జరిమానా**

మెడికల్ అభ్యర్థులు ప్రభుత్వసేవలో చేరకపోయినా?, లేదా నిర్ణీత కాలంలో పూర్తి చేయకపోయినా? భారీ జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధనను ఉల్లంఘించే డిప్లొమా అభ్యర్థులకు రూ.15 లక్షలు, పిజి డిగ్రీ అభ్యర్థులకు రూ.20 లక్షలు జరిమానాను విధిస్తారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యకు అనుమతి ఉండదు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా సంబంధిత అభ్యర్థులపై నిషేధం ఉంటుంది. ఈ మార్గదర్శకాలను అన్ని మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు కచ్చితంగా అమలు చేసే విధంగా అకౌంట్స్, స్టైఫండ్స్ విభాగాలు పర్యవేక్షించాలని డిఎంఇ ఆ మార్గదర్శకాలలో సూచించింది.

# గ్రామాల్లో మహిళా శక్తికి కొత్త వేదికలు

### శరవేగంగా మహిళా భవనాల నిర్మాణం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో గ్రామీణ మహిళల సాధికారతను బలోపేతం చేసే దిశగా మహిళా సంఘాల భవనాల నిర్మాణం వేగంగా కొనసాగుతోంది. ఇందిరా మహిళా శక్తి పథకం కింద చేపట్టిన ఈ కార్యక్రమం గ్రామీణాభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తోంది. రాష్ట్రంలోని 12,728 గ్రామపంచాయతీలలో మహిళా భవనాల నిర్మాణానికి కనీసం 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాల మేరకు ఇప్పటివరకు 8,193 స్థలాలు గుర్తించారు. వీటిలో 6,261 భవనాలకు కలెక్టర్ల అనుమతులు లభించగా, 5,017 భవనాల నిర్మాణానికి అంచనాలు సిద్ధమయ్యాయి. మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నిత్య పర్యవేక్షణలో, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పనులు వేగవంతమవుతున్నాయి. డైరెక్టర్ దివ్యా దేవరాజన్ ప్రత్యేక చొరవతో సెర్ప్, పంచాయతీరాజ్ శాఖల మధ్య సమన్వయం మెరుగుపడటంతో స్థలాల గుర్తింపు నుంచి నిర్మాణం వరకు అన్ని దశల్లో పురోగతి సాధ్యమవుతోంది. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా ములుగు జిల్లాలో పలు గ్రామాల్లో మంత్రి సీతక్క మహిళా భవనాలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా, ఆత్మకూరు మండలం సర్వేపల్లి గ్రామంలో తొలి భవనం ప్రారంభమైంది. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం ఆల్వాల్ గ్రామపంచాయతీలో మరో భవనం పూర్తి అయింది. ఈ మహిళా భవనాలు గ్రామీణ మహిళలకు ఆత్మగౌరవానికి ప్రతీకలుగా నిలవడంతో పాటు ఆర్థిక స్వావలంబనకు దోహదం చేయనున్నాయి. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి, ఆదా య వనరుల పెంపు వంటి కార్యకలాపాలకు ఇవి కేంద్రాలుగా మారనున్నాయి. అవసరమైతే మహిళలు తయారు చేసే ఉత్పత్తుల విక్రయ కేంద్రాలుగా కూడా ఉపయోగించుకునే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మహిళలకు బలమైన వేదిక కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళా సంఘాల భవనాలు వారి ఆర్థిక, సామాజిక బలోపేతానికి కేంద్రాలుగా మారతాయని తెలిపారు. స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకోవడానికి, ఒకచోట చేరి నిర్ణయాలు తీసుకునే వేదికగా ఇవి ఉపయోగపడతాయన్నారు. నిర్దిష్ట కాలంలో భవనాల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు ఆమే సూచించారు.

## 7 న 'బస్ భవన్ బచావో'
### టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి సంస్థకు చెందిన ఆస్తులను కొల్లగొట్టాలనే ఆలోచనతో పాటు ఆర్‌టిసిని ప్రైవేటీకరణ చేయడంలో భాగంగానే సంస్థలోని ఆస్తులను ఒక్కొక్కటిగా అన్యాక్రాంతం చేయడానికి చూస్తుందని, దీనికి నిరసనగా ఈ నెల 7న 'బస్ భవన్ బచావో' కార్యక్రమానికి జెఎసి పిలుపునిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బస్ భవన్‌కు చెందిన ఎ బ్లాక్ కార్యాలయమును కమర్షియల్ ట్యాక్స్(వాణిజ్య పన్నుల) శాఖకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని, వెంటనే ఆ జిఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ 9 లో ఉన్నటువంటి ఉమ్మడి ఆస్తుల పంపకాలు నేటి వరకు పూర్తి కానప్పటికీ, విధాన పరమైన నిర్ణయాలు ఆర్‌టిసి ఉమ్మడి ఆస్తులపై జరగనప్పటికీ, అలాగే కార్పొరేషన్ ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారం లేనప్పటికీ అధికార బలంతో ఏకపక్షంగా ఆర్‌టిసి కార్యాలయమును స్వాధీన పరచుకోవడం సమంజసం కాదని జెఎసి నాయకులు జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు అన్నారు. కావున ఈ ''బస్ భవన్ బచావో'' కార్యక్రమమును గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పని చేస్తున్న అన్ని కార్మిక సంఘాలకు చెందిన నాయకులు, కార్మికులు తమ విభేదాలు విడనాడి, ఐకమత్యంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే 'బస్ భవన్ బచావో' కార్యక్రమానికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని డిపోల గేట్ల ముందు ధర్నాలు, నిరసన ప్రదర్శనలు పెద్దఎత్తున నిర్వహించాలని జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జెఎసి కోశాధికారి బి.యాదయ్య, జె.రాఘవులు, ఎన్.కమలాకర్ గౌడ్, డి.గోపాల్, బుద్ధ విశాల్, నగేష్ పటేల్, రాం చందర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఆర్‌సి నివేదిక వెంటనే విడుదల చేయాలి
### టిజిఇ జెఎసి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల సవరణకు సంబంధించిన పిఆర్‌సి నివేదికను వెంటనే విడుదల చేయాలని టిజిఇ జెఎసి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. జెఎసి ఛైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్ రావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. 2023 సంవత్సరంలో ఏర్పాడిన పిఆర్‌సి కమిటీ ఇప్పటికే ఉద్యోగ సంఘాల అభిప్రాయాలను సేకరించిందని, సమీక్షను కూడా పూర్తి చేసినప్పటికీ , ఆ నివేదిక విడుదల కాలేదని, తద్వారా ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ఉద్యోగుల ఆదాయం, ఖర్చుల మధ్య భారీ అంతరం ఏర్పడిందని, పిల్లల విద్య, వైద్యం,గృహ రుణాల ఇఎంఐలు వంటి అవసరాలను తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందని, చాలా మంది ఉద్యోగులు నెలకు సుమారు రూ.20 వేల లోటుతో జీవిస్తున్నారని జెఎసి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పిఆర్‌సి సిఫార్సులు 2024 ఏప్రిల్ నాటికే రావాల్సి ఉన్నప్పటికీ, ఆలస్యం కారణంగా ఉద్యోగులు తమ హక్కులను కోల్పోతున్నారని తెలిపింది. ఇప్పటికైనా పిఆర్‌సి నివేదికను విడుదల చేసి, వెంటనే అమలు చేయాలని, మరో సారి గడువును పొడిగించవద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే సానుకూల చర్యలు తీసుకోవాలని జెఎసి విజ్ఞప్తి చేసింది.

## అధికారుల బదిలీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పరిపాలన సౌలభ్యంలో భాగంగా ప్రభుత్వం ఇద్దరు ఐఎఎస్ అధికారులకు స్థాన చలనం కల్పించింది. 1995 బ్యాచ్‌కు చెందిన ఐఎఎస్ అధికారి ఎ.వాణి ప్రసాద్‌కు పర్యాటకం, సాంస్కృతిక,యువజన సేవల శాఖల ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది. మెట్రోపాలిటన్ ఏరియా, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్‌ను తప్పించి ఆయనకు క్రీడల శాఖ పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు (జిఓ 431) జారీ చేసింది.



## సమాజానికి అండగా నిలబడండి
### హరీశ్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వాలు పోరాటాలను అణిచివేసేందుకు ప్రయత్నిస్తాయని,అలాంటి సమయంలో న్యాయ వాదులు సమాజానికి అండగా నిలబడాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు సూచించారు.న్యాయం దక్కని పీడితుల పక్షాన గొంతుకగా నిలబడాలని న్యాయ విద్యార్థులకు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ న్యాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో 'ఒయు ఠాగూర్' ఆడిటోరియంలో గురువారం జరిగిన 'దుసిమస్‌వి లీడ్'ము గింపు కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా న్యాయస్థానాల్లో 5 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇప్పటికీ పేదలకు న్యాయం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శాసనసభలో 'విద్వేశ ప్రసంగాల బిల్లు'ను ప్రవేశపెట్టారని, దీనిని శాసన సభ్యులంతా వ్యతిరేకిస్తే ఈ బిల్లును 'సెలెక్ట్ కమిటీ'కి పంపిచారని వివరించారు. బి.ఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛ హక్కును కాపాడాల్సిన బాధ్యత యువ న్యాయవాదులపైన ఉందన్నారు. యువత రాజకీయాల్లోకి రాలని, దేశానికి ఒక కొత్త మార్గదర్శకం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాసీం హాజరయ్యారు.

## త్వరలో అందుబాటులోకి శాస్త్రీపురంలో ఆర్‌ఒబి
### ఏర్పాట్లను పరిశీలించిన చీఫ్ ఇంజనీర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పరిధిలోని శాస్త్రిపురం వద్ద సికింద్రాబాద్ – ఫలక్‌నుమా – శివరాంపల్లి రైల్వే లైన్‌పై నిర్మిస్తున్న లెవల్ క్రాసింగ్ (ఎల్‌సి) నెంబర్ 7 రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబి) పనులు తుది దశకు చేరుకున్నాయి. స్థానిక ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, ఈ ప్రాజెక్టు త్వరలోనే అందుబాటులోకి రానుంది. త్వరలోనే ఈ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. గురువారం జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ ఏర్పాట్లు పరిశీలించారు. రూ.71 కోట్లు వ్యయంతో ఈ ప్రాజెక్టు నిర్మించారు. ఎం.ఎస్ ఎం. వెంకటరావు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఈపిసి విధానం)లో టెండర్ దక్కించుకుంది. 490 మీటర్లు వంతెన పొడవుతో అప్రోచ్ రోడ్లతో కలిపి నిర్మించారు. రైల్వే ట్రాక్ పైన 37.28 మీటర్ల మేర స్పాన్ నిర్మాణాన్ని రైల్వే అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణం సంపూర్ణమైంది. రైల్వే పోర్షన్‌ను కలిపే ఇంటర్ కనెక్షన్ మేకప్ స్పాన్ గిర్డర్లు, డెక్ స్లాబ్ పనులు కూడా విజయవంతంగా ముగిశాయి. ఈ ఆర్‌ఓబిని ప్రారంభిస్తే వస్తే శాస్త్రిపురం, శివరాంపల్లి ప్రాంతాల వాసులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడమే కాకుండా, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది.


## రూ.1,008 కోట్ల ఆదాయంతో టిజిఎండిసి రికార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిజిఎండిసి) 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,008 కోట్ల ఆదాయం సాధించి కొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాది (2024–25)తో పోలిస్తే ఇది 36 శాతం వృద్ధిగా నిలిచింది. ఇసుక అమ్మకాల ద్వారా వచ్చిన ఆదాయం ఈ వృద్ధికి ప్రధాన కారణమని టిజిఎండిసి వైస్ చైర్మన్, ఎండి భవేష్ మిశ్రా తెలిపారు. 2016–17లో రూ. 419 కోట్లుగా ఉన్న ఆదాయం, పలు వ్యూహాత్మక చర్యలతో క్రమంగా పెరిగి ఈ ఏడాది నాలుగు అంకెలను దాటింది. అక్రమ తవ్వకాల నియంత్రణ, ఆన్‌లైన్ బుకింగ్ వ్యవస్థ, 365 రోజులు ఇసుక అందుబాటు, శాఖల మధ్య సమన్వయం వంటి చర్యలు సంస్థ పనితీరును బలోపేతం చేశాయి. సిసిటివి పర్యవేక్షణ, కెమెరాల ఏర్పాటు ద్వారా రవాణాపై నిఘా పెంచడం కూడా కీలకంగా మారింది. ఇక ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం 2025–26లో 9.86 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేయడం జరిగింది. ఇది గత ఏడాదితో పోలిస్తే సుమారు 72 శాతం పెరుగుదల. అదేవిధంగా కొత్త ఇసుక బఫర్ యార్డులు ఏర్పాటు చేసి సరఫరా వ్యవస్థను విస్తరించారు. ఈ చర్యలతో ఇసుక లభ్యత మెరుగై, ప్రజలకు సమానంగా అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ విజయంతో టిజిఎండిసి రాష్ట్రానికి ఆదాయం మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా సృష్టించినట్లు అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత పారదర్శకత, సమర్థతతో కార్యకలాపాలను విస్తరించేందుకు సంస్థ కృషి కొనసాగిస్తుందని భవేష్ మిశ్రా తెలిపారు.

## కీలక అంశాలకు మండలిలో ప్రభుత్వం సమాధానం చెప్పలేదు
### మధుసూదనాచారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ నాయకుల ఢిల్లీ చుట్టే తిరుగుతున్నారని శాసనమండలి ప్రతిపక్షనేత సి.మదుసూదనాచారి ఆరోపించారు. శాసనమండలి సమావేశాల్లో ప్రాధాన్యత కలిగిన కీలక అంశాలపైన ప్రభుత్వం సమాధానం చెప్పలేదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాసనమండలి బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు ఎల్.రమణ, ఎంఎల్‌సి సురభి వాణితో కలిసి మదుసూదనాచారి మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజా సమస్యలు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపైన ఎటువంటి చర్చ జరగక పోవడం బాధాకరమన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే పాలన తీరు సక్రమంగా లేదని, కానీ కాంగ్రెస్ నాయకులు పక్క రాష్ట్రాలకు వెళ్లి ప్రచారం. చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అక్రమంగా దోచుకున్న డబ్బులను వారు ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల కోసం ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. చేనేత కార్మికులకు భీమాను కొనసాగిస్తామని చెప్పి మోసం చేశారని మండిపడ్డారు

## 'దోమ గౌన్'తో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిరసన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో దోమల నివారణకు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని నిరసిస్తూ బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ సుధీర్ రెడ్డి దోమ తెరతో కుట్టిన ''దోమ గౌన్'ను ధరించి శాసనసభ లోని మీడియాహాల్‌లో గురువారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నోరు తెరిస్తే నోట్లోకి దోమలు పోతున్నాయని,దోమలతో హైదరాబాద్ ప్రజలు ఇబ్బందులు పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో నాలుగు , ఐదు సార్లు దోమల నివారణకు చర్యలు తీసుకున్నామని గుర్తు చేశారు. దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో డెంగ్యూ, మలేరియాతో పేద ప్రజలు ఆసుపత్రి పాలవుతున్నారన్నారు. హైదరాబాద్‌లోని ప్రతి డివిజన్ కు 10 ఫాగింగ్ మిషన్లను ఇవ్వాలని సుధీర్ రెడ్డి డిమాండ్ చేశారు.

## రికార్డుల పంట పండించిన దక్షిణ మధ్య రైల్వే

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే 2025 26 ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో రికార్డుల పంట పండించింది. ప్రయాణికుల రవాణా నుంచి సరుకు రవాణా వరకు, ఆదాయం నుంచి మౌలిక వసతుల అభివృద్ధి వరకు ప్రతి రంగంలో అత్యుత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఈ ఏడాది 286.44 మిలియన్ మంది ప్రయాణికులను రవాణా చేయడంతో పాటు రూ. 6,235 కోట్లకు పైగా ఆదాయం సాధించినట్టు తెలిపారు. అదే సమయంలో 147.87 మిలియన్ టన్నుల సరుకును రవాణా చేసి రూ. 13,575 కోట్ల ఫ్రైట్ ఆదాయం నమోదు చేసినట్లు వెల్లడించారు. మొత్తంగా ఎస్‌సిఆర్ రూ. 21,211 కోట్లకు పైగా గ్రాస్ ఒరిజినేటింగ్ రెవెన్యూ నమోదు చేసి కొత్త రికార్డు సృష్టించిందన్నారు.



## వర్గీకరణ అమరుల కుటుంబాలను ఆదుకోవాలి

రూ.కోటి చొప్పున సాయం, ప్రభుత్వ ఉద్యోగమివ్వాలి

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు డిమాండ్

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ఎస్‌సి వర్గీకరణ సాధన ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం చేసి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మాదిగ అమరవీరుల స్థూపం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం మాదిగలకు పార్లమెంట్, అసెంబ్లీ, శాసనమండలి స్థానాలను కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. మాదిగ మహిళలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఎంఆర్‌పిఎస్ ఉద్యమకారులపై పెట్టిన కేసులను ఎత్తేయాలని కోరారు. మాదిగ నిరుద్యోగ యువతకు ఉద్యోగ భృతి కల్పించాలన్నారు. అన్ని కోర్టుల్లో ఎజిపి, జిపి, పిపి నియమాకాల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. దళిత యువ న్యాయవాదులకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు స్టైఫండ్ పెంచాలని కోరారు.

## సమసమాజ నిర్మాణమే లక్ష్యం

లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఎం.దశరథ్

**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** సబ్బండ వర్గాలకు రాజ్యాధికారం, సమసమాజనిర్మాణమే లేబర్ పార్టీ ఆఫ్ ఇండియా లక్ష్యమని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దశరథ్ నాయక్ తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లో ఆయన మాట్లాడుతూ బిసిలలో, ఎస్‌సిలలో రెండు,మూడు కులాలు తప్ప, మిగతా కులాలు రాజకీయంగా వెనుకపడ్డాయన్నారు. ఈ కులాలు రాజకీయంగా అభివృద్ధి ఎప్పుడు సాధిస్తాయని ప్రశ్నించారు. రాజ్యాంగపరంగా అన్ని సబ్బండ కులాలకు ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి, ఎంపి స్థానాలలో సమాన వాటా కల్పించాలని డిమాండ్‌చేశారు. అప్పుడే దేశంలో సకల జనులకు రాజ్యాధికారం దక్కుతుందన్నారు. ఇప్పటికీ రెడ్లు, వెలమ, బ్రాహ్మణ ఆధిపత్య కులాలే రాజకీయంగా, ఆర్థికంగా ముందు వరుసలో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు అసెంబ్లీ గేటు తాకని ఎస్‌సి, బిసి కులాలు ఎన్నో ఉన్నాయన్నారు. రాజకీయ పార్టీలు ఎస్‌సిలను, బిసిలను ఓట్లు వేసే యంత్రాలుగా చూడకుండా రాజకీయ వాటాలో సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలని దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు.

## విద్యార్థులకు థియేటర్ వర్క్ షాప్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** జాతీయస్థాయి నాటక రచయిత, దర్శకుడు, ప్రముఖ కవి దెంచనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా జనపదం నాటక రిపర్టరీ నిర్వహిస్తున్నారు. దేవలమ్మ నాగారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు థియేటర్ వర్క్‌షాప్ నిర్వహించారు 8, 9 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ థియేటర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. భావోద్వేగాల ప్రదర్శన దేహాన్ని సృజనాత్మకంగా వాడుకోవడం నటీనటులు వ్యూహాశక్తిని పెంచుకోవడం కథ చెప్పడం..తదితర అంశాలపై శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. సమాజంలో జరుగుతున్న హింస, దోపిడీ, అసమానుతలపై విద్యార్థులకు సామాజిక స్పృహ అవసరమని.. చైతన్యాన్ని ఇచ్చే నాటకాలు బాలలకు పరిచయం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## వేసవిలో చలివేంద్రాలు ఉపయోగకరం

**ప్రజాపక్షం/కంటోన్మెంట్ :** బాటసారులకు, ప్రయాణీకులకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మోండా డివిజన్ పాస్‌పోర్ట్ కార్యాలయం ప్రాంతంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు వైష్ణవి యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇలాంటి కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విఠలేశ్వర టెంపుల్ కమిటీ చైర్మన్ గౌరీ శంకర్, వెంకట్ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శేఖర్ ముదిరాజ్, నందికంటి రవి, బాబూరావు, శ్రీనాథ్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం/ఖైరతాబాద్/బంజారాహిల్స్/హిమాయత్‌నగర్ :** వేంకటేశ్వరనగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే శ్రీనగర్‌కాలనీలోని సాయినాథ్ యూత్ అసోసియేషన్‌కు చెందిన ఎం. ఆనంద్, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమం, అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సోమాజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో యూత్ సభ్యులు ఆనంద్, నటరాజ్, వాసు, బీఆర్‌ఎస్ నాయకులు మధుకర్ యాదవ్, బాబు అన్న, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా.. కుమ్మరి బస్తీలో అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించిన పూజ కార్యక్రమాలు, అన్నప్రసాద పంపిణీ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మహేష్ యాదవ్ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజా, చలపతి, కృష్ణ, మహేష్, శ్రీను, చింటూ తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఫిలింనగర్‌లో అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తదుపరులు పాల్గొన్నారు.కాగా... ఖైరతాబాద్ డివిజన్ లైబ్రరీ చౌరస్తా బడా గణేష్ వద్ద బజరంగ్ భక్త బృందం ఏర్పాటు చేసిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి పాల్గొనడం జరిగింది. ఇదిలాఉండగా.. హనుమాన్ శోభాయాత్రలో భాగంగా నారాయణగూడ ఎక్స్‌రోడ్ వద్ద కేశబోయిన శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమంలో 2000 మందికి పైగా భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు మాధవి నర్సింగ్‌గౌడ్, శ్రీనివాస్, నరహరి, అర్జున్ సింగ్, తుల్జా రామ్, వాణి, సరిత, కవిత, బాలకృష్ణ గౌడ్, నవీన్, నవీన్ చంద్ర, వేణు గౌడ్, సాయి, కార్తిక్, రంజీత్, భాను రాజా గౌడ్, అనిల్ ముదిరాజ్, మహేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరిని గురువారం మర్యాదపూర్వకంగా కలిసిన ట్యాంక్‌బండ్ శివ దంపతులు

ప్రజాపక్షం / సిటీ బ్యూరో

విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాలకు

# నూతన భవన నిర్మాణం చేపట్టాలి

విద్యా కమిషన్ సలహాదారు ఆర్.వెంకట్‌రెడ్డి పిలుపు

15న రౌండ్ టేబుల్ సమావేశం

సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్



**ప్రజాపక్షం/తార్నాక :** విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాలకు వెంటనే నూతన భవనాన్ని నిర్మించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలంగాణ విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్‌రెడ్డి కోరారు. విజయ డెయిరీ పాఠశాలను కాపాడాలని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ప్రస్తుతం పాఠశాలలో సరైన తరగతి గదులు లేకపోవడం, పాత భవనం దెబ్బతినడం, తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలు లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యతను దృష్టిలో ఉంచుకుని ఆధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మించడం అత్యవసరమని పేర్కొన్నారు.

**15న రౌండ్ టేబుల్ సమావేశం**

సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యంగా సీతాఫల్ మండి విద్యా సంస్థల భవన నిర్మాణానికి పెండింగ్‌లో ఉన్న నిధులను మంజూరు చేయాలని, విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాలకు శాశ్వత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేండ్ సమావేశం నిర్వహిస్తున్నామని సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విద్యార్థి యువజన సంఘాలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకానున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ నాయకులు ఉపేందర్ యాదవ్, ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య యాదవ్, అనిల్ కుమార్, టిజిపిటిఏ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున్ రెడ్డి, పవన్ రాజ్, సిఆర్‌పిఎఫ్ నాయకులు ప్రవీణ్, శోభ, సిపిఐ డివిజన్ కార్యదర్శి గౌస్, స్కూల్ ఉపాధ్యాయులు ప్రభాకర్, జోసెఫ్ భాను, ఉదయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్

హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదివరన్ పలని

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** సమాజహితం, స్వయం పాలనకోసం వీరోచితంగా పోరాడిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌అని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ కదివరన్ పలని(రెవెన్యూ) తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం మరుగున పడ్డ యోధులు, కళాకారులు, మేధావుల సేవలను గుర్తించి వారి జయంతులు, వర్ధంతులను అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని చెప్పారు. జనగామ ప్రాంతంలో జన్మించిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సాధారణ నేపథ్యంలో పెరిగి గోల్కొండ పాలకుల అన్యాయపు విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ప్రజలను ఏకం చేసి, చైతన్య పరిచి పోరాటాల ద్వారా భువనగిరి కోట సహా అనేక ప్రాంతాలను స్వాధీనం చేసుకుని స్వయం పాలన చేశారని చెప్పారు. ఆయన పోరాటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జితేందర్‌రెడ్డి, డిఆర్‌ఓ వెంకటాచారి, బిసి సంఘం జాతీయ నాయకులు జాజుల శ్రీనివాస్ గౌడ్‌లతో కలిసి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖాధికారి ఆశన్న, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజి, జిల్లా అధికారులు, బిసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



## సురభి థియేటర్ ఫెస్టివల్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** సురభి కళాక్షేత్రమ్ నిర్వహణలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ , తెలంగాణా చలనచిత్రం, టివి నాటకరంగ అభివృద్ధి సంస్థ వారి సహకారంతో థియేటర్ ఫెస్టివల్ 2026 ఘనంగా జరిగింది. సురభి నాటకకళను భావి తరాలకు అందించే నేపథ్యంలో సురభి కుటుంబ సభ్యుడు, రంగస్థల కళాకారుడు డా.రమేష్ సింధే ఆధ్వర్యంలో యువతకు రెండు నాటకాలను నేర్పించి సురభి కళాక్షేత్రమ్ థియేటర్ గ్రూప్ తరపున థియేటర్ ఫెస్టివల్‌ని నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా నెల్లుట్ల రమాదేవి రచించిన మీడియా మేనియా(నాటిక), తనికెళ్ల భరణి రచించిన గోగ్రహణం (నాటిక) ప్రదర్శించారు.

## పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో బహుజనులు ఏకం కావాలి

ఆయన విగ్రహ రూపకల్పనకు గౌడ సంఘాల అభిప్రాయం తీసుకోవాలి

పాపన్నగౌడ్ 316వ వర్ధంతి సభలో పలువురు వక్తలు డిమాండ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** బహుజన రాజ్య స్థాపకులు, భారత తొలి తెలుగు విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో రాజ్యాధికారానికి బహుజనులంతా ఏకం కావాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రాజ్యాధికారం సాధించినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టు అవుతుందన్నారు. ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించే పాపన్నగౌడ్ విగ్రహ రూపకల్పనకు బిసి, గౌడ సంఘాల అభిప్రాయం తీసుకోవాలని కోరారు. పాపన్న గౌడ్ జయంతి ఆగస్టు 18 నాటికి ఆయన విగ్రహాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గౌడ సంఘాల సమన్వయ కమిటీ, బిసి పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 316వ వర్ధంతి సభ ఫ్రంట్ కన్వీనర్ అంబాల నారాయణ గౌడ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్ రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్‌గౌడ్, ప్రజా గాయని విమలక్క,ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, పలువురు ప్రముఖులు పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా దేశంలో బహుజనులు దౌర్భాగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. బహుజన బిడ్డ కాబట్టే సర్వాయి పాపన్నగౌడ్ చరిత్రను బహిర్గతం కాలేదన్నారు. చిరంజీవులు మాట్లాడుతూ రాజ్యాధికారానికి ముందు సాంస్కృతిక పునరుజ్జీవం జరగాలన్నారు. బిసిల మహనీయుల చరిత్రను వెలికితీసి, బహిర్గతం చేయాలని అప్పుడే ఉద్యమం బలపడుతుందన్నారు. బాల్‌రాజ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం జనగామ జిల్లాకు సర్వాయి పాపన్నగౌడ్ పేరు పెట్టాలని డిమాండ్‌చేశారు. చాకలి అయిలమ్మ, దేశిని చిన్నమల్లయ్య, ధర్మభిక్షం,కొండా లక్ష్మణ్‌బాపూజీ మహనీయుల త్యాగాలు, పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తామన్నారు. అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ పాపన్న కోటలను పరిరక్షించాలని, ఆయన చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. నూతన పార్కులకు, కారిడార్లకు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని కోరారు. సమావేశంలో ఫ్రంట్ రాష్ట్ర నేతలు ఎస్.దుర్గయ్యగౌడ్, బైరు శేఖర్, బత్తిని కీర్తి లత, యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, బండి సాయన్న, సింగం నాగేశ్వర్, చెన్న శ్రీకాంత్ నేత తదితరులు పాల్గొన్నారు.

# పౌల్ట్రీ రంగంలో రైతులకు నష్టాలు

రిటైల్ వ్యాపారులకు లాభాలు

స్నేహ గ్రూప్ చైర్మన్ రాంరెడ్డి ఆందోళన




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** పౌల్ట్రీ రంగంలోని మూడు స్థాయి వ్యవస్థల్లో చివరికి రైతులు, వినియోగదారులే నష్టపోతుండగా.. మధ్యవర్తులైన హోల్‌సేల్ , రిటైల్ వ్యాపారులు లాభాలు పొందుతున్నారని స్నేహ గ్రూప్ చైర్మన్ రాంరెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పౌల్ట్రీ రంగం బ్రాయిలర్ రైతులు, హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ దుకాణదారుల మధ్య నడుస్తుందని తెలిపారు. పక్షులను పెంచే రైతులు భారీ పెట్టుబడులు పెట్టి రిస్క్ భరిస్తుండగా, వినియోగదారులు అధిక ధరలు చెల్లించాల్సి వస్తోందన్నారు. చికెన్ రిటైల్ దుకాణదారులు తక్కువ పెట్టుబడితో, ఎటువంటి రిస్క్ లేకుండా వ్యాపారం చేస్తూ ప్రతి కిలోపై గణనీయమైన లాభాలు పొందుతున్నారని అన్నారు. ఉదాహరణకు, లైవ్ బర్డ్ ధర రూ.130 ఉండగా, స్కిన్లెస్ చికెన్ ధర రూ.259గా విక్రయించడం వల్ల కిలోకు సుమారు రూ.44 మార్జిన్ వస్తోందని వివరించారు. ఇంటిగ్రేషన్ కంపెనీలు, రిటైల్ దుకాణదారుల మధ్య ప్రత్యక్ష సంబంధం లేదని, హోల్‌సేల్ వ్యాపారుల ద్వారానే సరఫరా జరుగుతోందన్నారు. మార్కెట్లో ధరల హెచ్చుతగ్గులు వచ్చినా రిటైల్ వ్యాపారులకు పెద్దగా నష్టం ఉండదని తెలిపారు. రైతులు , ఇంటిగ్రేటర్లే తీవ్రంగా ప్రభావితమవుతున్నారని అన్నారు. మీడియా ఈ అంశంపై లోతుగా పరిశీలించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు తెలియజేయాలని కోరారు. సమావేశంలో వీఎచ్‌పిఎల్ జనరల్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, ఎస్‌ఆర్‌ఏ యాచరీస్ గ్రేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎస్ ఎస్ పౌల్ట్రీస్ ప్రతినిధి బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా ఆర్ట్ ఫెస్టివల్

నేటి నుంచి మూడు రోజులు నిర్వహణ



**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ :** ప్రముఖ సమకాలీన కళా ప్రదర్శనల్లో ఒకటైన ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ మళ్లీ హైదరాబాద్ నగరానికి వచ్చింది. ఏప్రిల్ 3 నుంచి 5 వరకు జూబ్లీహిల్స్ రోడ్ నెం:51లోని కన్వెన్షన్ సెంటర్‌లో మూడు రోజుల పాటు ఆర్ట్ ఫెస్టివల్ జరుగుతుంది. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. దేశ విదేశాల నుంచి వచ్చిన కళాకారులు రూపొందించిన... పెయింటింగ్స్, శిల్పాలు, డ్రాయింగ్స్, మిక్స్ మీడియా వర్క్స్‌తో పాటు భారతీయ సాంప్రదాయ కళలకు ఆధునిక రూపకల్పనలను కూడా చూడవచ్చు. ఫిగరేటివ్, అబ్‌స్ట్రాక్ట్ నుంచి ప్రయోగాత్మక విజువల్ ఎక్స్‌ప్రెషన్స్ వరకు విభిన్న శైలులు ప్రేక్షకులను ఆకట్టుకోనున్నాయి. ఈ సందర్భంగా ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ డైరెక్టర్ రాజేంద్ర పాటిల్ మాట్లాడుతూ, కళాకారులు, గ్యాలరీలు, కళాభిమానులు, కలెక్టర్ల మధ్య నేరుగా అనుసంధానం ఏర్పడే ప్రజాస్వామ్య వేదికను సృష్టించడం ఈ ఫెస్టివల్ లక్ష్యం అని తెలిపారు. ప్రఖ్యాత కళాకారులు జోగెన్ చౌధురి, లక్ష్మా గౌడ్, రమేష్ గొర్జాల, లక్ష్మణ్ ఎలే, ఎంఎఫ్ హుస్సేన్, పి.గ్యాన్, ప్రవీణ్ ఉపాధ్యే తదితరుల కృతులు ఈ ప్రదర్శనలో కనిపించనున్నాయి. అలాగే డెవ్ మెహతా, వివేక్ కుమావత్, డీవీఎస్ కృష్ణ, రామ్దాస్ లోఖి, సుజాత ఆహేర్, సంచిత్ జైన్, కల్పన ఆర్య, నిధి శర్మ, సయేద్ జుబేర్ బకర్, కుమార్ గైక్వాడ్, షాలిని అగర్వాల్, సిద్ధార్థ్ శింగాడే, సచిన్ సాగరే వంటి సమకాలీన కళాకారుల కృతులు కూడా ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా వందలాది యువ, మధ్య స్థాయి కళాకారుల పాల్గొనడంతో ఈ ఫెస్టివల్ కొత్త కళాత్మక స్వరాలను పరిచయం చేసే అరుదైన వేదికగా నిలుస్తుంది.

మూసీ సుందరీకరణ పేరిట

# పేదల ఇండ్లను కూల్చడం చట్టవిరుద్ధం

రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావులు, బిఆర్‌ఎస్ నేతల ధ్వజం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మూసీ నది సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం లక్షలాది మంది పేదలను నిరాశ్రయులను చేయాలని చూడటం దారుణమని, ఈ 'దోపిడీ ప్రాజెక్టు'పై రాజీలేని పోరాటం చేస్తామని బిఆర్‌ఎస్ నాయకులు, పర్యావరణ మేధావులు హెచ్చరించారు. బిఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన 'మూసీ సుందరీకరణ వాస్తవాలు' అనే అంశంపై రౌండ్ టేండ్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ, గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఒక్క ఇటుకను కూడా కదిలించకుండా మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి ప్రజల కష్టాల కంటే రియల్ ఎస్టేట్ కమిషన్ల మీదే ధ్యాస ఉందని ఆరోపించారు. డబ్బులు లేవని చెప్పే సిఎం, రూ.లక్ష కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు? అని ప్రశ్నించారు. అనంతరం బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎలాంటి సమగ్ర ప్రణాళిక లేకుండానే వేల ఇండ్లకు నోటీసులు ఇచ్చి ప్రభుత్వం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోందని మండిపడ్డారు. విద్యార్థి లోకం పేదల పక్షాన నిలబడి ఈ ప్రాజెక్టు లోపాలను ఎండగడుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ..మూసీ ప్రక్షాళన అనేది ఒక పెద్ద రియల్ ఎస్టేట్ దందా అని ఆరోపించారు. థేమ్స్ నది ప్రక్షాళన 150 ఏళ్లుగా జరుగుతోంది, రేవంత్‌రెడ్డి రెండేళ్లలో ఎలా చేస్తారు? అని ప్రశ్నించారు.ఇది కేవలం అదానీ వంటి కార్పొరేట్లకు భూములు కట్టబెట్టే కుట్ర అని విమర్శించారు. ఓయూ మాజీ విసి రవీందర్ యాదవ్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ లింబాద్రి మాట్లాడుతూ ..ప్రాజెక్టు వల్ల సామాజిక, ఆర్థిక ప్రభావంపై అధ్యయనం జరగాలని, ప్రజల సామాన్య విజ్ఞానాన్ని గౌరవించాలని సూచించారు. నదులకు బఫర్ జోన్ నిబంధనలు ఉండవని, 2012 నిబంధనల ప్రకారం కట్టిన ఇళ్లను ఇప్పుడు కూల్చడం చట్టవిరుద్ధమన్నారు. మూసీ బాధితుల పక్షాన క్షేత్రస్థాయిలో పోరాడుతామని, అవసరమైతే మరో 'మిలియన్ మార్చ్' తరహా ఉద్యమాన్ని చేపడతామని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థి నేతలు, మేధావులు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## పనుల పురోగతిపై సమీక్ష

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** పురోగతిలో ఉన్న పనులన్నీ ఏప్రిల్ మాసాంతం వరకు పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన ఈ సమీక్ష సమావేశంలో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరమైన 202526లో చేపట్టిన పనుల పురోగతితో పాటు పనుల నాణ్యత ప్రమాణాలు, అలాగే పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఎండీ అశోక్‌రెడ్డి విస్తృతంగా చర్చించారు. ఓ అండ్ ఎమ్ పరిధిలో సర్కిల్ వారీగా మంజూరైన పనుల అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్, ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటి వివరాలను, అలాగే టెక్నికల్ సాంక్షన్ పొంది పనులు, టీఎస్ జారీ కాకుండా ఆలస్యం అవుతున్న పనుల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే టెండర్ ప్రక్రియలో ఉన్న పనులు, స్పందన రాని లేదా రద్దయిన టెండర్ల కారణాలను చర్చించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. పనులు చేపట్టేటప్పుడు భద్రత, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులు చేపట్టేలా చూసుకోవాలని అన్నారు. పనులు పూర్తిచేసిన అనంతరం వెలువడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. తవ్వకాలకు చేపట్టిన రోడ్డు పునరుద్ధరణ పనులను మే రెండో వారంలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం రోడ్డు పునరుద్ధరణ పనులు త్వరగా పూర్తిచేసి నగరవాసులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. సమీవేశంలో మూడు రీజియన్ల ఈడీలు పంకజ, స్వామాట్ అశోక్, సంతోష్, ఆపరేషన్ డైరెక్టర్లు వినోద్ భార్గవ, నారాయణ, శ్రీనివాసరెడ్డి, సిజిఎంలు, జిఎంలతో పాటు ఐటీ, రెవిన్యూ విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనికేషన్ బోర్డు ప్రారంభం

ఆటిజం చిన్నారుల కోసం వినూత్న చొరవ

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్న చిన్నారులు బహిరంగ ప్రదేశాల్లో ఇతరులతో సులభంగా సంభాషించేలా హైదరాబాద్ వేదికగా ఒక అద్భుతమైన కార్యక్రమం ప్రారంభమైంది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కులో దేశంలోనే మొట్టమొదటిసారిగా జీహెచ్‌ఎంసీ, అవాజ్, మర్హమ్ రిజోనేటింగ్ రెసిలెన్స్ ఎన్జీఓ, సీడీసీ టాక్ అండ్ లెర్న్, కోరు కిడ్జ్ సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'కమ్యూనికేషన్ బోర్డు'ను ప్రపంచ ఆటిజం దినోత్సవం సందర్భంగా గురువారం ఒలింపిక్ పతక విజేత సైనా నెహ్వాల్, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్ కలిసి ఆవిష్కరించారు.

## అందరూ హనుమాన్ చాలీసా చదవాలి

**ప్రజాపక్షం/సికింద్రాబాద్ :** హనుమాన్ జయంతి సందర్భంగా బౌద్ధనగర్ డివిజన్‌లోని వారసిగూడ గంగపుత్ర సంఘం వీధిలో ప్రముఖ న్యాయవాది, గంగపుత్ర సంఘం నాయకుడు దేశ భవిన రఘు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్ పాల్గొన్నారు. అలాగే అశోక్ నగర్, సంజీవపురం, అంబర్ నగర్, పుల్లయ్య బావి,ఎల్ నారాయణ నగర్ వారాసిగూడ, బౌద్ధ నగర్, సంజీవపురం తదితర బస్తీలలో నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం, పూజా, అన్నదాన కార్యక్రమాలలో పాల్గొని ప్రతి ఒక్కరు కూడా హనుమాన్ చాలీసా చదివి పిల్లల చేత కూడా చదివించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోలీస్ అధికారి పాక శ్రీనివాస్, నాయకులు రవి ప్రసాద్ గౌడ్, కట్కూరి రమేష్, మహిళా అధికారిణి రమ, దామెర సదానంద్, వంగల సుధాకర్, జక్కనబోయిన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# సన్‌రైజర్స్ ఘన విజయం



ఐపిఎల్ –2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ 65 పరుగుల భారీ తేడాతో కోలకత్తా నైట్ రైడర్స్‌ను చిత్తు చేసింది. ముందుగా బ్యాటర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో భారీ విజయం సాధిస్తే.. ఆ తర్వాత బౌలర్లు నిప్పులు చెరిగారు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 226 పరుగులే చేసింది. హెన్రీచ్ క్లాసెన్(35 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. ట్రావిస్ హెడ్(21 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సతో 46), అభిషేక్ శర్మ(21 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సతో 48) దూకుడుగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో బ్లెస్సింగ్ ముజరబాని (4/41) నాలుగు వికెట్లు తీయగా.. వైభవ్ అరోరా (2/47) రెండు వికెట్లు పడగొట్టాడు. కార్తీక్ త్యాగి, అంకూల్ రాయ్ చెరో వికెట్ పడగొట్టారు.

**చరిత్ర సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్!**

అనంతరం కెకెఆర్ 16 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. అంగ్క్రిష్ రఘువంశీ(29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సతో 52) హాఫ్ సెంచరీతో రాణించగా.. రింకూ సింగ్(25 బంతుల్లో 4 ఫోర్లు, సిక్సో 35), ఫిన్ అలెన్(7 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సతో 28) దూకుడుగా ఆడారు. సన్రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కత్(3/21) మూడు వికెట్లు తీయగా.. ఎషాన్ మలింగా(2/14), నితీష్ కుమార్ రెడ్డి(2/17) రెండేసి వికెట్లు పడగొట్టారు. హర్షా్ బేకు ఒక వికెట్ దక్కింది.

**కొంపముంచిన రనౌట్..** 227 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో అదిరిపోయే ఆరంభాన్ని అందుకున్న కెకెఆర్..అనవసర రనౌట్‌తో మూల్యం చెల్లించుకుంది. ముఖ్యంగా అసాధారణ బ్యాటింగ్‌తో హాఫ్ సెంచరీ సాధించిన రఘు వంశీ ఈ రనౌట్‌కు కారణమయ్యాడు. ముందుగా అనవసర పరుగు పరుగెత్తి కామెరూన్ గ్రీన్(2) రనౌట్‌కు కారణమైన అతను రెండో సారి తానే వికెట్ పారేసుకున్నాడు. ముఖ్యంగా రింకూ సింగ్ తో కలిసి ఐదో వికెట్‌కు 46 పరుగులు జోడించిన అనంతరం రనౌట్‌గా వెనుదిరిగి కెకెఆర్ ఓటమికి కారణమయ్యాడు. ఎషాన్ మలింగాఅద్భుత త్రోతో రఘువంశీ రనౌట్‌గా వెనుదిరిగాడు. ఈరనౌట్ మ్యాచ్ కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది. ఆ తర్వాత కెకెఆర్ వరుసగా వికెట్లు కోల్పోయి ఓటమిపాలైంది.

## జింబాబ్వే పర్యటనకు భారత్



**ముంబై :** వరల్డ్ చాంపియన్ భారత జట్టు ఈ ఏడాది జులైలో జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఆఫ్రికా దేశంతో మూడు మ్యాచ్‌ల టి–20 సిరీస్ ఆడేందుకుగాను టీమ్‌ఇండియా.. జింబాబ్వే పర్యటనకు వెళ్లనున్నట్టు బుధవారం బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. పొట్టి ప్రపంచకప్‌ను వరుసగా రెండోసారి దక్కించుకున్న భారత్.. చివరిసారిగా 2024లో జింబాబ్వే టూర్‌కు వెళ్లింది. ప్రపంచకప్ విజయం తర్వాత టీమ్‌ఇండియాకు ఇదే తొలి ద్వైపాక్షిక సిరీస్. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఇరుజట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరుగుతాయి.

## ఏషియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌కు విశ్వనాథ్, సచిన్



**ఉలన్బాతర్ (మంగోలియా) :** ఏషియా బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మూడో రోజూ భారత బాక్సర్లు దుమ్మురేపారు. మంగోలియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా విశ్వనాథ్ సురేశ్, సచిన్ సివాచ్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. పురుషుల 50 కిలోల క్యాటగిరీలో విశ్వనాథ్.. 50తో కిర్గిస్థాన్ బాక్సర్ బెక్జట్ ఎర్గెష్వా ఏకపక్ష విజయం సాధించి తదుపరి రౌండ్కు ముందంజ వేశాడు. మెన్స్ 60 కిలోల విభాగంలో సచిన్.. 41తో బుయండలై బయర్ఖు (మంగోలియా)ను ఓడించి క్వార్టర్స్ చేరాడు.

## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## సింథటిక్ వస్త్రాల ఉత్తత్తి అధిక నగరం

☞ భారతదేశ మొదటి ముస్లిం రాష్ట్రపతి ఎవరు?
జాకీర్ హుస్సేన్

☞ మొదటి రాజ్యాంగ సవరణ రాజ్యాంగానికి ఎన్నో షెడ్యూల్ని కలిపింది?
9

☞ 'పచ్చల ద్వీపం (ఎమరాల్డ్ ఐలాండ్)' అని పేరుగాంచిన ప్రదేశం
ఐర్లాండ్

☞ ప్రపంచంలోని మొదటి మహిళా ప్రధాన మంత్రి ఏ దేశానికి చెందినవారు?
శ్రీలంక

☞ కుతుబ్షాహీ రాజ్యం ఎప్పుడు పతనమైంది?
క్రీ.శ. 1687

☞ 'చిప్కో' అంటే ... ?
చెట్లను ఆలింగనం చేసుకోవడం

☞ తెలంగాణ రాష్ట్రోదయం గ్రంథ రచయిత ఎవరు?
ఆచార్య కోదండరాం

☞ ఎత్తయిన ప్రాంతంలో ఇల్లునిర్మించుకోవడం
వరద నివారణ చర్య

☞ వాల్మీకి రామాయణానికి రాఘవీయం అనే వ్యాఖ్యను ఎవరు రాశారు?
రావు మాదానాయకుడు

☞ టీవీ రిమోట్ కంట్రోలర్ నుంచి ఏ తరంగాలు వెలువడతాయి?
పరారుణ కిరణాలు

☞ జాతీయ ఆదాయాన్ని దేశంలో ప్రథమంగా లెక్కించింది ఎవరు?
దాదాభాయ్ నౌరోజీ

☞ భారతదేశ మొదటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
హెచ్‌జే కానియా

☞ ఎర్రచందనం ఏ జిల్లాలోని అడవులలో లభిస్తుంది?
చిత్తూరు

☞ ఆస్ట్రేలియా అకాడెమీ ఆఫ్ సైన్సెస్ కరస్పాండింగ్ సభ్యుడిగా ఇటీవల ఎన్నికైన భారతీయుడు ఎవరు? (ఈ ఘనత సాధించిన తొలి భారతీయ శాస్త్రవేత్త ఈయనే
సీఎస్ఆర్ రావు

☞ కిందివాటిలో దేనికి ఎక్కువబలం ఉంటుంది?
కేంద్రక బలం

☞ వాతావరణ మార్పు జాతీయ అనుసరణ నిధి ప్రారంభ మొత్తం ఎన్ని కోట్ల రూపాయలు?
100

☞ భారతదేశంలో పోర్చుగీసు గవర్నరుగా ఎవరిని నియమించారు?
ఫ్రాన్సిస్కోడి అల్మెడా

☞ గాంధేయ విధానాల్లో చిప్కో ఉద్యమాన్ని ఏమని పిలిచేవారు?
అడవి సత్యాగ్రహం

☞ విద్యుత్ ఆవేశానికి ప్రమాణం
కూలుంబు

☞ గట్టి కలప లభించు ప్రాంతం
అమెజాన్

☞ మొక్క లేతగా ఉన్నప్పుడు కిరణజన్య సంయోగ క్రియ జరుపుకొనుమొక్క భాగము?
కాండము

☞ మూడింట రెండు వంతులు ఉష్ణమండలంలో ఉన్న ఖండం
దక్షిణ అమెరికా



☞ విద్యుత్ ప్రవాహానికి ప్రమాణం
ఆంపియర్

☞ హిమోగ్లోబిన్ వుండే రక్త భాగము
ఎరిత్రోసైట్

☞ భారతదేశంలో మొగల్ సామ్రాజ్యాన్ని ఎవరు స్థాపించారు?
బాబర్

☞ నిక్టలోపియా అని ఏ వ్యాధిని అంటారు?
రేచీకటి

☞ శంకరాచార్యుడు బోధించిన తాత్వికశాఖ
అద్వైతం

☞ రాకెట్ ఇంధనాన్ని మండించడానికి ఉపయోగించే పదార్థం?
అమ్మోనియం పెర్క్లోరైట్

☞ 'సోలదగండదు' అనే బిరుదు ఎవరిది?
ఒకటో బద్దెగడు

☞ సైబీరియన్ కొంగ కనిపించే సాంక్చ్యుయరీ
భరత్పూర్

☞ దీనిని రాతినూనె అంటారు.
పెట్రోలియం

☞ వాహకంలోని కరెంట్ని కొలిచే పరికరం
అమ్మీటర్

☞ అంతర్జాతీయ న్యాయ స్థానం ఎక్కడ ఉంది?
హేగ్



☞ ఇందులో ఏదేశానికి వీటో అధికారం కలదు?
ఫ్రాన్స్

☞ కణములో కేంద్రకము కలదని తెలిపినది.
రాబర్ట్ బ్రౌన్

☞ 1858లో క్వీన్ విక్టోరియా ప్రకటనను ఎవరు చాటారు?
కానింగ్

☞ గవర్నర్ ను అభిశంసించే అధికారం ఎవరికి ఉంది?
ఎవరు అభిశంసించలేరు

☞ దక్షిణాన విజయనగర రాజులకు ప్రధాన విరోధులైన సుల్తానులు ఎవరు?
బహమనీ

☞ వీటో అధికారం వున్న ఐ.రా.స. అంగం
భద్రతా మండలి

☞ 1 కూలుంబు / 1 వోల్ట్ =, 1 ఫారడ్

☞ పొటాషియం పెర్మాంగనేటు నీటిలో కలిపిన నీటిరంగు ఇలా ఉంటుంది.
ఊదా

☞ ఏ విటమిను ఎనిమల్ ప్రొటీన్ ఫ్యాక్టర్ అంటారు?
బి12

☞ 'ఘటిక' అనేది ఎవరి నివాస స్థావరం?
బ్రాహ్మణ పండితులు

☞ ఏ శాసనంలో మొదటి తెలుగు కంద పద్యాలున్నాయి?
కురిక్యాల శాసనం

☞ వజ్రం దేని రూపాంతరం?
కార్బన్

☞ కింది ఏ సంగ్రామం భారతదేశంలో మొగలు సామ్రాజ్య స్థాపన, తర్వాత దాని వ్యాప్తికి ఆరంభంగా గుర్తింపు పొందింది?
కణా సంగ్రామం

☞ రాష్ట్ర శాసనసభ సమావేశాలు జరగనప్పుడు ఏ ఆర్టికల్ ప్రకారం గవర్నర్ ఆర్డినెన్సును జారీ చేస్తారు?
213

☞ సింథటిక్ వస్త్రాల ఉత్తత్తి అధిక నగరం?
ముంబయి

# పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి
షేక్ బాష్ మియా



**ప్రజాపక్షం/వరంగల్ :** ప్రజలకు మరింత చేరువై, పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం చేపట్టామని వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. సిపిఐ వరంగల్ మండల సమితి ఆధ్వర్యంలో కాశిబుగ్గ సెంటర్‌లో సామూహిక నిధి సేకరణ కార్యక్రమాన్ని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని, ప్రజాహక్కుల రక్షణకు అండగా ఉండే సిపిఐని ప్రజలు ఆదరించి, ఆర్థికంగా బలోపేతమవడానికి విరివిగా విరాళాలు అందజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బుస్స రవీందర్, గన్నారపు రమేష్, వరంగల్ మండల సహాయ కార్యదర్శి జన్ను రవి, ఆరే రాజు, కొయ్యడ మనోహర్, అయితే ప్రసాద్, వసంత, బాగ్యశ్రీ, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఇంటింటికీ సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్‌వలీ ఉల్లాహ్‌ఖాద్రీ అన్నారు. వరంగల్ నగరంలోని ఎల్బీ నగర్‌లో నిర్వహించిన ఇంటింటికీ సిపిఐ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటా సిపిఐ కార్యక్రమం ప్రధానంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం లక్ష్యంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలతో నేరుగా కలసి వారి దైనందిన సమస్యలను అర్థం చేసుకుని, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రజలతో అనుబంధాన్ని మరింత బలపరచాలని ఆయన పిలుపునిచ్చారు. సేకరించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తీసుకెళ్లి పరిష్కారం సాధించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, నాయకులు జగదీష్, అజాజ్, రమత్ మతీన్, విక్టోరియా తదితరులు పాల్గొన్నారు.

**హసన్‌పర్తి :** ఇంటింటికీ సిపిఐ సామూహిక విరాళాల సేకరణను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, సీనియర్ నాయకులు మోతే లింగారెడ్డి పార్టీ శ్రేణులకు కోరారు. హసన్‌పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలో మెట్టు శ్యాంసుందర్ రెడ్డి అధ్యక్షతన ఇంటింటికీ సిపిఐ సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. కార్యక్రమంలో నేదునూరి రాజమౌళి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాంపల్లి లక్ష్మయ్య గోపు బుచ్చిరెడ్డి. బండ రాజిరెడ్డి బండ దామోదర్ రెడ్డి, బండ జయపాల్ రెడ్డి గిన్నారపు రాజు, గడ్డం రాజు, గడ్డం శాంత, గడ్డం రాదా, రేణిగుంట్ల సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకు ఫించన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి**

**కోదాడ:** ఇంటింటికీ సిపిఐ గడపగడపకు సిపిఐ అనే నినాదంతో ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం కోదాడ పట్టణంలోని రామిరెడ్డి పాలెంలో ఎంఎస్ నగర్‌లో ప్రాంతాలలో సిపిఐ బృందం పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హులైన వారికి ఫించన్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలని పోరాట కార్యక్రమాన్ని రూపొందించబోతున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె లతీఫ్, సాయిబెల్లి, లింగయ్య, గోపినాయక్, రెహ్మాన్, మోసిన్, జానీ పాల్గొన్నారు.








## కమ్యూనిస్టులంటే మోదీ, అమిత్ షాలకు భయం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ్మా



**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాలకు కమ్యూనిస్టులంటే ఎందుకంత భయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలనరసింహ్మా ప్రశ్నించారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలచంలో జరిగిన సిపిఐ జిల్లా సమితి సమావేశానికి ముఖ్య అతిథిగా బాల నరసింహ్మా హాజరై మాట్లాడారు. పార్లమెంట్‌లో అమిత్‌షా సిపిఐపైన కమ్యూనిస్టులపైన చేసిన ఆరోపణలు సరికాదన్నారు. దేశంలో కమ్యూనిస్టులు బలపడాలని లేకపోతే ప్రశ్నించే శక్తులు కనుమరుగవుతాయన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నందు వల్లనే మోదీ, అమిత్ షాలు కమ్యూనిస్టులను, కమ్యూనిజాన్ని, పోరాటం చేసి వాళ్ళని, ప్రశ్నించే వాళ్ళని టార్గెట్ చేస్తున్నారని విమర్శించారు. గద్దర్ లాంటి తెలంగాణ జాతిపితను పార్లమెంటు సాక్షిగా విమర్శించడం అంటే ఇంతకన్నా సిద్ధుమాలిన పని ఇంకొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ శతాబ్ది కాలం నుంచి చేసిన పోరాటాలు, త్యాగాలు ఎన్నెన్నో చెప్పలేనివని, భవిష్యత్తు మరిన్ని ఉద్యమాలకోసం గడప గడపకు సిపిఐ విరాళాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని, ప్రజాహక్కుల రక్షణకు అండగా ఉండే సిపిఐని ప్రజలు ఆదరించి, ఆర్థికంగా బలోపేతమవడానికి విరివిగా విరాళాలు అందజేయాలని ఆయన కోరారు. గద్వాల జిల్లా కేంద్రంలో సురవరం సుధాకర్ రెడ్డి పేరుతో ఏర్పాటు చేసే సిపిఐ జిల్లా కార్యాలయం నిర్మాణానికి పెద్ద ఎత్తున సహకరించగలరనీ కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు ఆశన్న, నాగార్జున, కాశీం, ఉప్పేరు కృష్ణ, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త కార్మిక చట్టాల రద్దుకు పోరాటాలు

ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా
అధ్యక్షుడు రెహమాన్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** హక్కులు హరిస్తున్న కొత్త కార్మిక చట్టాల రద్దుకు కార్మికలోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.ఎ.రెహమాన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి వద్ద తెలంగాణ మెడికల్ అవుట్ సోర్సింగ్ అండ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సయ్యద్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా రెహమాన్ మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మికుల సంక్షేమానికి మరణ శాసనాలైనా లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ శక్తులతో చీకటి ఒప్పందాలు చేసుకుని లాబాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను దొడ్డి దారిన తీసుకొచ్చారన్నారు. కార్మికవర్గం సర్వహక్కులు కోల్పోయి ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు, యాజమానుల వద్ద కట్టు బానిసలుగా మర్చేందుకు ఈ లేబర్ కోడ్‌లను తీసుకోచ్చారన్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి 12గంటల పని విధానాన్ని అమలు చేసే ప్రయత్నం చేయడం కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. కనీస అవసరాలకు సరిపడా వేతనాలు చెల్లించుకుండా చట్టం తేవడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఈ చట్టాల ద్వారా పేదవారిని ఇంకా పేదవారీగా మార్చే ప్రయత్నం తప్పా అభివృద్ధి కాదన్నారు. ప్రభుత్వం ఆసుపత్రిలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్టు వర్కర్స్‌కు వేతనాలను నేరుగా కార్పోరేషన్ ద్వారా మరి బ్యాంక్ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యనిర్వాహక అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, ప్రధానకార్యదర్శి చట్లావాసు, ఉపాధ్యక్షులు, భాను చందర్, పహీం, చంద్రశేఖర్, షకీల్ జాన్ లైఖ పాషా, హాజీ, అంజీ, నగేష్, సీను పాల్గొన్నారు.

# దళిత, బహుజనులపై పెరుగుతున్న దాడులు

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
మారుపాక అనిల్ కుమార్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, దళిత, బహుజనులపై దేశవ్యాప్తంగా దాడులు పెరుగుతున్నాయని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం తన వినాశకరమైన విధానాలతో సామాజిక సమాధి కడుతోందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ, బహుజన, దళిత, మైనారిటీ వర్గాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోందని ఆయన ఆరోపించారు. దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ కరీంనగర్ జిల్లా సమావేశం గురువారం జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో బోయినీ తిరుపతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి జాతీయ సమితి సభ్యుడు బొయిని అశోక్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరై మారుపాక అనిల్‌కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చు పెట్టి, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తోందని, మనువాద భావజాలాన్ని రుద్దడం ద్వారా సమాజాన్ని విడగొట్టే కుట్రలు చేస్తోందన్నారు.దళితులు, మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగుతుందన్నారు. అన్ని సామాజిక శక్తులు ఏకమై ఈనియంతృత్వ పోరాటాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 17, 18 తేదీల్లో వరంగల్ లో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు అనిల్‌కుమార్ తెలిపారు. సమావేశంలో బత్తుల బాబు, గంగాధర రఘు, వినోద్ కుమార్, నాంపల్లి, బి.అశోక్, తదితరులు పాల్గొన్నారు.



## చేతివృత్తి సంఘాల అభివృద్ధికి కృషి

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రజా ప్రభుత్వంలో కుల, చేతివృత్తి సంఘాల సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఉప్పల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. చిలుక నగర్ డివిజన్ పరిధిలోని నవోదయ వడ్డెర సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.34.25 లక్షలు, అలాగే కురుమ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల (జిఒ) ప్రతులను ఆయన సంఘాల ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ భవనాల నిర్మాణం ద్వారా సంఘాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం చిలుకనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్, నవోదయ వడ్డెర సంఘం అధ్యక్షుడు గండికోట గణేష్, ప్రధాన కార్యదర్శి దండగుల శంకర్, కురుమ సంఘం అధ్యక్షుడు కాట చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి గుంటి అయిలయ్య తదితరులు పరమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, అక్కిటి ఆగం రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## గర్భిణీలకు ఉచిత కాన్పులు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** బాచుపల్లి మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ హాస్పిటల్‌లో గర్భిణీ స్త్రీలకు ఉచిత కాన్పులు చేసి, ఆడపిల్ల పుడితే రూ.6000, మగ పిల్లవాడు పుడితే రూ.5000 నగదుతో పాటు మమత డెలివరీ కిట్టును గురువారం మమత అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్స్ బాచుపల్లి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నయన్ రాజ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మమత హాస్పిటల్‌లో కాన్పులకు వచ్చే గర్భిణీ స్త్రీలకు ఇది గొప్ప అవకాశం అని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## చెట్లను కాపాడితే ఆరోగ్యం, పరిశుభ్రత

### మొక్కలు నాటిన డిసి చాముండేశ్వరి



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ఎల్లమ్మ బండ వాటర్ రిజర్వాయర్ వద్ద రాజన్న టీమ్ ఆధ్వర్యంలో గురువారం ఆల్విన్‌కాలనీ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ చాముండేశ్వరి చెట్లను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రగతికి మెట్లు పచ్చని చెట్లు అని, చెట్లను కాపాడుకోవడం వల్ల అవి మనల్ని, మన ఆరోగ్యాల్ని పరిసరాలను కాపాడుతాయని అన్నారు. నాటిన చెట్లను తొలగించకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఈ వాటర్ ట్యాంక్ వద్ద అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలు తరుచు స్థానికులను ఇబ్బంది పెడుతున్న విషయా న్ని రాజన్న టీమ్ సభ్యుడు బుల్లెట్ రవి డీసీ దృష్టికి తీసుకెళ్లగా అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు, చెట్లు నాటడం వంటి కార్యక్రమాలు చేయబోతున్నామని రాజన్న టీమ్ వివరించడంతో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుడ్ల శ్రీనివాస్, మల్లేష్, బాబు, రాజు, అరుణ్, ఉప్పల రాజు, హరీష్, తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** లక్ష్మాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు మొరపెట్టుకున్నారు. గురువారం లక్ష్మాపూర్‌లోని వార్డు కార్యాలయంలో వార్డు సభ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, చైర్మన్ జాం రవి లు విచ్చేసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడంలేదని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. గత ప్రజాపాలనలో రైతుల నుంచి వచ్చిన భూ సమస్యలకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను విడతల వారీగా పరిష్కరించాలని ప్రత్యేక అధికారిని నియమించాలని కోరారు. సానూకులంగా స్పందించిన అధికారులు త్వరలోనే లక్ష్మాపూర్ భూ సమస్యలను పరిష్కరించుటకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీవాణి, సరిత, నీరజ్‌గౌడ్, రెవెన్యూ అధికారులు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి

**ప్రజాపక్షం/చర్లపల్లి :**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా ఇసిఐఎల్‌లో చౌరస్తాలో గౌడ్స్ వేల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఆద్వర్యంలో గురువారం ఘనంగా నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ జెఎసి రాష్ట్ర కో కన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్, అసోసియేషన్ అద్యక్షులు తాళ్ల ఆనంద్‌గౌడ్, బుడంపల్లి నిరంత్‌గౌడ్, రత్నపురం వెంకటేశ్వర్లు, రఘుపతిగౌడ్, గణేష్‌గౌడ్, రామకృష్ణ, పాండుగౌడ్, సత్యం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా కెబిఆర్ పార్క్ ప్యాకేజీ పనులు

### రూ. 1090 కోట్లతో కెబిఆర్ పార్క్ ఫ్లైఓవర్లు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పరిసరాల్లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు ప్రతిష్టాత్మక కెబిఆర్ పార్క్ ప్యాకేజీ పనులు శరవేగంగా సాగుతున్నా యి. సుమారు 1090 కోట్ల రూపాయల అంచ నా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్టీల్ బ్రిడ్జిల నిర్మాణం ఊపందుకుంది. అత్యంత రద్దీగా ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కెబిఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో చేపట్టిన ఫ్లైఓవర్, అండర్ పాస్, గ్రేడ్ సపరేటర్, స్టీల్ బ్రిడ్జిల పనులు వేగవంతమయ్యాయి. ఈ మెగా ప్రాజెక్టును సమర్థవంతంగా పూర్తి చేసేందుకు రెండు భాగాలుగా విభజించారు. ప్యాకేజీI (రూ. 580 కోట్లు): జూబ్లీహిల్స్ చెక్పోస్ట్, కెబిఆర్ ప్రవేశమార్గం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లతో పాటు ముగ్ధ (ముద్ర) జంక్షన్ వద్ద అండర్‌పాస్ నిర్మాణం చేపట్టారు. ప్యాకేజీII (రూ. 510 కోట్లు): రోడ్ నెంబర్ 45 జంక్షన్, ఫిల్మ్ నగర్, మహారాజ్ అగ్రసేన్ జంక్ష న్, క్యాన్సర్ హాస్పిటల్ జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో 7 ఫ్లైఓవర్లు (స్టీల్ బ్రిడ్జిలతో కలిపి), 7 అండర్‌పాస్‌లు అందుబాటులోకి రాను న్నాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మెయిల్ (మెగా ఇంజినీరింగ్) ఈ పనులను చేపట్టింది.



**పురోగతిలో పనులు..** పార్క్ హయత్, ముగ్ధ జంక్షన్, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 2 వద్ద, పార్క్ హయత్ సమీపంలో పివన్, పిటు పునదుల పనులు పూర్తి చేశారు. కెబిఆర్ ఎంట్రన్స్ వద్ద పి5 ఫౌండేషన్‌కు సంబంధించి స్టీల్ కట్టడం పనులు కొనసాగుతున్నాయి. 85 స్పాన్‌లలో ఇప్పటికే 66 స్పాన్‌లు పూర్తయ్యాయి. తాజాగా పిత్రివన్, పిత్రిటు స్పాన్‌ల డెక్ స్లాబ్ కాంక్రీటింగ్ పనులు ముగిశాయి. నిర్మాణ పనుల వల్ల వాహనదారులకు ఇబ్బంది కలగకుండా అధికారులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం జాయింట్ సిపి (ట్రాఫిక్)తో సమన్వయం చేసుకుని, రాత్రి సమయాల్లో పనులు వేగవంతం చేస్తున్నారు. వచ్చే వారం నుంచి ముగ్ధ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతాల్లో ప్యాకేజీ2 పనులు కూడా గ్రౌండ్ లెవల్లో ప్రారంభం కానున్నాయని అధికారులు వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12, జూబ్లీహిల్స్ పరిసరాల్లో ప్రయాణం ఎంతో సులభతరం కానుంది.

**ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలి: స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్ ఆదేశం**

కెబిఆర్ పార్క్ ఫ్లైఓవర్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్‌లతో కలిసి గురువారం ఎల్.వి. ప్రసాద్ ఐ



ఆసుపత్రి నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, రోడ్ నెంబర్ 45 వరకు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనుల పురోగతిని ఇంజనీరింగ్ అధికారులు ప్రతి వారం సమీక్షించాలని, ఎక్క డా జాప్యం జరగకుండా చూడాలని జయేష్ రంజన్ స్పష్టం చేశారు. పనుల్లో వేగం పెంచేందుకు నిర్మాణ సంస్థ అయిన మెయిల్ (మెగా) అదనపు యంత్రాలను, కార్మికులను తక్షణమే సమకూర్చుకోవాలని కమిషనర్ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇఇ, డిఇఇ, ఏఇఇ అధికారులతో పాటు నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఐపిఎల్ మ్యాచ్‌లకు భారీ భద్రతా ఏర్పాట్లు




**ప్రజాపక్షం/ఉప్పల్ :** టాటా ఐపిఎల్ 2026 మ్యాచ్‌లు ఏప్రిల్ 5 నుంచి మే 22 వరకు ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్న నేపథ్యంలో గురువారం ఉప్పల్ జోన్ డిసిపి సురేష్ కుమార్, ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోలీసులు విస్తృత భద్రతా, ట్రాఫిక్ ఏర్పాట్లు గురించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మ్యాచ్‌లు ఎలాంటి అంతరాయాలు లేకుండా సజావుగా నిర్వహించేందుకు సుమారు 2000 మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామని, మ్యాచ్ రోజులలో లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, టిఎస్ఎస్పీ, ఆర్మ్డ్ రిజర్వ్, బాంబ్ డిస్పోజల్ టీమ్ తదితర విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయి. స్టేడియం పరిసర ప్రాంతాల్లో మొత్తం 430 సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ నిర్వహించనున్నారు. అదేవిధంగా స్నిఫర్ డాగ్స్, యాంటీ సబోటేజ్ చెక్స్ కూడా నిరంతరం కొనసాగుతాయి. ప్రేక్షకుల భద్రత దృష్ట్యా మద్యం, గాజు సీసాలు, కత్తులు, లైటర్లు, లేజర్ పాయింటర్లు, బ్యాగులు వంటి నిషేధిత వస్తువులను స్టేడియంలోకి అనుమతించరు. ప్రతి గేట్ వద్ద స్కానింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచనున్నారు. గేట్ నంబర్ 1ను కేవలం ఆటగాళ్లకే కేటాయించారు. ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక డైవర్షన్లు అమలు చేస్తూ భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు. స్టేడియం వద్ద రెండు చక్రాల, నాలుగు చక్రాల వాహనాలకు వేర్వేరు పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ప్రేక్షకులు వ్యక్తిగత వాహనాలకంటే ఆర్టీసీ బస్సులు, మెట్రో సేవలను వినియోగించాలని సూచించారు. మ్యాచ్‌కు మూడు గంటల ముందు నుంచే ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తారు. చెల్లుబాటు అయ్యే టికెట్ ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. సరైన గేట్ల ద్వారా ప్రవేశించి, ట్రాఫిక్, భద్రతా నియమాలను పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. మొత్తంగా, ప్రేక్షకుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ మరియు మ్యాచ్‌లు సాఫీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, అలియబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డిలు అన్నారు. గురువారం ప్రజాపాలనలో బాగంగా అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో వార్డు సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ శాఖల ఆద్వర్యంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు చేయూత పెన్షన్, ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, డ్వాక్రా మహిళలకు రుణాలు, స్త్రీ శక్తి క్యాంటిన్‌లు, వ్యవసాయ శాఖకు సంబందించిన పథకాలను ప్రజలకు వివరించారు. అలాగే ఆర్థిక సంవత్సరం 2025–26 లో ఇంటిపన్నుల వసూళ్లలో అలియాబాద్ మున్సిపాలిటి రాష్ట్ర స్థాయిలో 6వ స్థానంలో నిలిచింది. అలియాబాద్ మున్సిపాలిటిలో తుర్కపల్లి వెంకటేష్ మొదటి స్థానం(94)శాతం, అలియాబాద్ రెండవ అనిల్‌రెడ్డి(93) శాతం, యాడారం ప్రశాంత్(92) శాతం మూడవ స్థానంలో నిలిచారు.

ఈ గ్రామాల బిల్ కలెక్టర్‌లను అదనపు కలెక్టర్ ఫైజన్ అహ్మద్, మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా, కమిషనర్ చంద్రశేఖర్‌లు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడుగా మహేష్ గౌడ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన ఉపాధ్యక్షులుగా ఘట్‌కేసర్ సర్కిల్ ఘనాపూర్‌కు చెందిన వేముల మహేష్ గౌడ్ నియమితులైనందుకు ఘట్‌కేసర్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్,ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్‌లు వేముల మహేష్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## మేడిపల్లి తహసీల్దార్‌గా వెంకట నర్సింహా రెడ్డి

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** మేడిపల్లి మండల నూతన తహసీల్దార్‌గా యం.వెంకట నర్సింహా రెడ్డి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

ప్రస్తుత తహసీల్దార్ కృష్ణ చైతన్య మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయనికి సి సెక్షన్ సూపరింటెండెంట్ గా బదిలీ పై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా వేగంగా అందించే దిశగా కృషి చేస్తానని, రెవిన్యూ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్ ను సన్మానించారు.


## పారాక్యాట్ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:**ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పారాక్వాట్‌తో పాటు దాని అనుబంధ రసాయన ఫార్ములేషన్ అమ్మకాలు, నిల్వ, పంపిణీ, తయారీ, వినియోగంపై మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 60 రోజుల పాటు నిషేధం తక్షణమే అమలులోకి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ తెలిపారు.

ప్రజారోగ్యం, రైతుల రక్షణ, సాగు పనుల్లో ఎదురయ్యే ఇబ్బందులపై వివిధ నివేదికల మేరకే ఈ నిషేధం కొనసాగుతోందన్నారు. ఈ దృష్ట్యా నిబంధనలను అతిక్రమించి పారాక్యాట్ ఉత్పత్తులను నిల్వ చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకొంటామన్నారు.

## పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే ఇసుక సరఫరా

### కలెక్టర్ దీపక్ తివారి




**ప్రజాపక్షం/వికారాబాద్:**జిల్లా వ్యాప్తంగా ఇసుక సరఫరా పూర్తిగా అన్‌లైన్ ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భం గా వీడియో కాన్ఫరెన్స్‌లో ఇసుక సరఫరా వినియోగం,రవాణా తదితర అంశాలపై రెవెన్యూ అదనపుకలెక్టర్ రాజేశ్వరిలతో కలిసి మైన్స్ శాఖ అధికారులతో కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం, ప్రభుత్వ అవసరాలకోసం ఇసుక పూర్తి గా eన్‌లైన్ విధానంలోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని eదేశించారు. ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే అన్‌లైన్ బుకింగ్ సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ అధికారిజయసుధ, ఉమేష్, సత్యనారాయణ , తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి శోభాయాత్ర

**ప్రజాపక్షం/పరిగి:** పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ అసమిపంలో గల దాసాంజనేయ స్వామి ఆలయంలో పూజలు జరిపించి అనంతరం అక్కడి నుండి శోభయాత్ర వీధుల గుండా శోభయాత్ర ప్రారంభించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్థసారథి పంతులు, హనుమంతుముదిరాజ్, ఎర్రగడ్డ పల్లి కృష్ణ, కుడుముల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలనే లక్ష్యంతో పనిచేయాలి

### స్పీకర్ ప్రసాద్‌కుమార్

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్:**ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిఫలాలు గ్రామాలలోని ప్రజలకు అందేలా అధికారులు పని చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. 99రోజుల 'ప్రజాపాలన–ప్రగతిప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా మోమిన్‌పేట్ మండల పరిధిలోని బూర్గుపల్లిగ్రామంలో గ్రామసభలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఆర్‌డిఓ వాసుచంద్ర, డిపిఓ జయసుధ, డిఎఒ రాజారత్నంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడటంతోనే మహిళలకు ఇచ్చిన హామీల అమలుకోసం కృషి చేస్తున్నాం అన్నారు. మీ అవసరాలను తెలుసుకునేందుకు 99 రోజుల ప్రజాపలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. మోమిన్‌పేట్ మండలం అమ్రాదికలాన్ గ్రామంలో విలేజ్ ల్యాండ్ రీసర్వేను ప్రారంభించి గ్రామ సభలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్టంలో నిజాం నవాబుల కాలంలో భూముల సర్వే జరిగింది. మళ్ళీ తొంబై ఏళ్ళ తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో భూముల రీసర్వే ఇప్పుడు జరుగుతుందన్నారు. ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్ ఇస్తారన్నారు. భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ సర్వే భూమి ఉన్న వారందరికీ మేలు జరుగుతుంది. భూమికి సంబంధించిన సమస్త సమాచారం అందుబాటులో ఉంటుంది. గ్రామాల్లో భూ పంచాయతీ గొడవలు ఉండవు అన్నారు. దీనికి గ్రామస్తులందరూ సహకరించాలని కోరారు.

## వైద్యులు ఎల్లప్పడూ అందుబాటులో ఉండాలి

### పిహెచ్‌సి సెంటర్‌ను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఎంతో నమ్మకంగా వచ్చే రోగులకు మెరుగైన చికిత్సలందించేందుకు వైద్యులు రేయింబవళ్లు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి సూచించారు. గురువారం కూకట్పల్లిలోని పిహెచ్‌సి సెంటర్‌ను డిఎంహెచ్‌ఓ ఉమాగౌరితో కల్సి తనిఖీ చేసారు. ప్రతిరోజు ఎంత మంది రోగులు వస్తున్నారు, ఎంత మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు, మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని వివరంగా వైద్యులు, సిబ్బందిని అడిగి తెల్సుకొన్నారు. దీంతో పాటు అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక వసతులు, అవసరమైన మరమ్మత్తు పనులు ఎప్పటికప్పుడు తనకు పంపించాలన్నారు.




## ఆటిజంపై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్ష /కూకట్‌పల్లి :** ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ పరిధిలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆటిజం ఒక జబ్బు కాదని, ఆటిజం ఉన్నవారు కూడా మన సమాజంలో సమాన హక్కులు కలిగిన మనుషులేనని తెలియజేడం దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. మమ్మల్ని అసహ్యించుకోవద్దు.. అర్థం చేసుకోండి.. మేము కూడా మీలాగే మనుషులమే అనే సందేశంతో ఆటిజం ఉన్న పిల్లలు, వారి తల్లిదండ్రులు సమాజానికి పిలుపునిచ్చారు. వారికి సరైన అవకాశాలు కల్పిస్తే తమలోని ప్రతిభను నిరూపించగలమని తెలిపారు. 2026 సంవత్సరానికి గాను ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం కేవలం అవగాహన కల్పించడం మాత్రమే కాకుండా, ఆటిజం ఉన్న వ్యక్తులను సమాజం ఆమోదించడం, వారి ప్రత్యేక ప్రతిభలను గుర్తించి అభినందించడం అనే అంశాలపై దృష్టి సారించడమే అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఏబీసీ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్, స్పెషల్ స్కూల్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నుండి సుచిత్ర సర్కిల్ వరకు ఆటిజం పిల్లలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సంస్థ యాజమాన్యం కళ్యాణి, పార్థివ్‌గౌడ్, సిబ్బంది సభ్యులు సుజాత, రాధిక, శశికల, జ్యోతి, సంధ్య, శివాని, దివ్య, ఆటిజం పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజాపాలన – పట్టణ ప్రణాళిక'

### అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కారం చేయడానికి ప్రజాపాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని అదనపు కలెక్టర్ ఉమాశంర్‌ప్రసాద్‌అన్నారు. 17వవార్డు మధుకాలని నందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశన్ని చదివి వినిపించారు. ప్రభుత్వ సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ అనన్య మాట్లాడుతూ వికారాబాద్ పట్టణ అభివృద్ధికి కట్టుబడి వున్నామని,ముఖ్యమంత్రిని కలిసినిధులు మంజురు చేయాలని కోరుతామన్నారు. ప్రభుత్వ అధికారులు మరింత బాద్యతతో పనిచేసి ప్రజా ప్రభుత్వనికి మంచి పేరు తీసుకుని రావాలని,ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మంగీలాల్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహ రెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు, రథోత్సవం

### చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిలోని అత్యంత పురాతణమైన శ్రీరామచంద్రస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని పూల మాలలతో సుందరంగా ముస్తాబు చేశారు. రామాలయం మొదలుకుని గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వరకు రథోత్సవంలో భక్తులు, ప్రజలు, చిన్నారులు కలిసి ఆనందంగా ఉత్సాహంగా రథోత్సవంలో పాల్గొన్నారు. అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి రథోత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం అనంతరం స్వామివారి విగ్రహాలను ఆలయ పూజారులు చక్రస్నానం చేయించారు. భక్తులకు కమఠం కృష్ణారెడ్డి అన్నదానం నిర్వహించారు.

GREATER HYDERABAD మహానగరి
హైదరాబాద్
శుక్రవారం
03-04-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily


## సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**ప్రజాపక్షం/మియాపూర్ :** మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ చౌరస్తా వద్ద బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి గౌడ్ సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు రమణ మూర్తి, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, కావూరి ప్రసాద్, బలింగ్ గౌతమ్ గౌడ్, మన్నేపల్లి సాంబశివ రావు, ఏకాంత్ గౌడ్, ఉదయ్ కిరణ్, సురేష్ గౌడ్, వెంకటేష్ గౌడ్, వినయ్ కుమార్ పుట్టా, శ్రీనివాస్ గౌడ్, రవి కుమార్ గౌడ్, తాండ్ర రాంచందర్, పవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహార లోపాలు ఎదుర్కోవాలి



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** పోషకాహార లోపాలను ఎదుర్కోవడంలో మినార్ మల్టిగ్రున్ గోధుమ పిండి అద్భుతమైన ఫుడ్ అని సినీనటీ శ్రియ సరన్ తెలిపారు. గురువారం మాదాపూర్‌లోని కొహినూర్ హోటల్ లో మినార్ మల్టిగ్రేన్ గోధుమ పిండి నూతన బ్రాండ్ ను అవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రియ సరన్, ప్రముఖ చెఫ్ సంజయ్ తుమ్మ, రిటైలర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చైర్మేన్ అన్నీష్ కుమార్, శ్రీ సాయి రోలర్ ఫ్లోర్ మిల్స్ డైరెక్టర్ ఆదిత్య బన్సల్, నూషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషిన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వి. శేషికరన్, మిల్లర్స్ ఫర్ న్యూట్రిషిన్ (ఆసియా) ప్రోగ్రామ్ టీడ్ మోనోజిత్ ఇంద్రలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ ఫుడ్ సేఫ్టీ విభాగ అధికారి అమృత మాట్లాడుతూ ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చేపడుతున్న ఫోర్టిఫికేషన్ కార్యక్రమాలకు పరిశ్రమలు మద్దతు ఇవ్వాలని కోరారు.

## అర్హులందరికీ రేషన్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అర్హులైన వారందరికీ రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ వివరించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 12,13,14వార్డుల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో వార్డు సభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ సన్నబియ్యం, 200యూనిట్ల ఉచితవిద్యుత్, 500గ్యాస్ సిలిండర్, ఉచిత ఆర్‌టిసి బస్సు ప్రయాణం, గిరిజన రైతులకు ఉచిత పంపుసెట్లు,, ఇందిరమ్మ ఇండ్లు, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్ల వంటి అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బసవేశ్వర్ అప్ప, కమిషనర్ సునీతారెడ్డి, కౌన్సిలర్లు నాజీయా భేగం, కళ్యాణ్‌కార్ దిలీప్, ప్రత్యేక అధికారి, ఏఈ రమేష్ పాల్గొన్నారు.

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/యాచారం :** గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ బాధితుల సమస్యలను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణ భాదితులు చేస్తున్న రిలే నిరహార దీక్షలు 17 వ రోజుకు చెరాయి. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ బలవంతగా ప్రభుత్వం భూసేకరణ చేస్తే గిరిజన రైతులందరం కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

## సాలార్పూర్ గ్రామంలో గ్రామసభ



**ప్రజాపక్షం/కడ్తాల్:** ప్రజాపాల ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా కడ్తాల్ మండల పరిధిలోని సాలార్పూర్ గ్రామంలో గురువారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి డి.సురేష్ కుమార్ సమక్షంలో గ్రామసభను ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నేనావత్ ప్రియ రమేష్, గ్రామ వార్డు మెంబర్స్, మాజీ ఎంపిటిసిలు, ఆశావర్కర్లు అనురూప, లక్ష్మమ్మ, స్వరూప ఫీల్డ్ అసిస్టెంట్ అజ్మత్ బేగం వివో ఏ సునీత, అంగన్వాడి కార్యకర్తలు సంగీత, శోభారాణి, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక ఆపలేరు

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** పట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ఆపలేరని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను మూడు సార్లు వాయిదా వేశారని విమర్శించారు. రేపు మున్సిపల్ కార్యాలయంలో జరిగే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను ఆపితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సత్తు వెంకటరమణ రెడ్డి, నిట్టు జగదీష్, కిరణప్ప తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు

ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణా రావు




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, కలెక్టర్ సి.నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా రాష్ట్రగీతాన్ని ఆలపించి, ముఖ్య మంత్రి సందేశాన్ని వినిపించారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన సంక్షేమ, ఉద్యానవన, వైద్య, ఆరోగ్య శాఖల స్టాల్‌లు సిఎస్, కలెక్టర్ సందర్శించారు.అనంతరం వివిధ శాఖల అధికారులు తమపరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి సిఎస్ మాట్లాడుతూ 2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్దేశమన్నారు. మనమందరం ఈప్రగతి పాలనలో భాగస్వాములం అవుదాం అన్నారు. ప్రభుత్వ గ్యారంటీ పథకాలతో పాటు, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్లు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. మహిళా సాధికారత కొరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, స్కూల్ యూనిఫాం కుట్టే పనులు, ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ వంటి కార్యక్రమాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే గ్రామసభల ముఖ్య ఉద్దేశమన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పిల్లల విద్యపై దృష్టి పెట్టడం, ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లను లబ్ధిదారుల కు సిఎస్ అందజేశారు. గ్రామసభ సమీపంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సిఎస్ కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, డిపిఒ వి.సురేష్ మోహన్, జిల్లా అధికారులు ఎల్.శ్రీలత, సురేష్, వనజాత, శ్రీలక్ష్మి, డాక్టర్ కె.లలితాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలపై అవగాహన



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ప్రజాపాలన..ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలందరు అవగాహన పెంచుకోవాలని ఫరూక్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్ సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో సర్పంచ్ వాకిటి నవకిరణి నరసింహులు అధ్యక్షతన గ్రామసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బన్సీలాల్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకం ప్రజలకు అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన లబ్దిదారులను గుర్తించి సంక్షేమ పథకాలను అంధిస్తున్నామని, అర్హులైన వారు ఎవరైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే అంధించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలో పాలకవర్గం సభ్యులు ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి కేంద్రీకరించేందుకు కృషి చేయాలని వివరించారు. సమస్యలను పరిష్కరించేందుకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ వాకిటి నవకిరణి నర్సింహులు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అభినవ్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, వార్డు సభ్యులు గడ్డమీది శ్రీను, గ్రామస్తులు సున్నాల శ్రీశైలం, చాకలి చంద్రయ్య, పిట్టల బాలయ్య పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యం

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వేసవిలో తాగు నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందించటంలో అధికారులు భాగస్వాములు కావలన్నారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ళతో పాటు ఇళ్ళ స్థలాలు పంపిణి చేస్తమని హామీ ఇచ్చారు. గ్రామలలో అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ముందుగా గ్రామ సభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, తహసీల్దార్ సునిత, ఎంపిడిఒ ప్రమీల, గ్రామ సర్పంచ్ బి.శ్రీవేణీ నందకుమార్, వివిధ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

### రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తా



**యాచారం :** రైతుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. బుధవారం ఫార్మాసిటీకి చెందిన ఫార్మా వ్యతిరేఖ ఉద్యమ నాయకులు, రైతులు ఎమ్మెల్యేను కలిశారు. రైతుల సమస్యలను కలెక్టర్‌తో మాట్లాడి సమావేశం ఏర్పాటు చేసి రైతుల సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఫార్మా ఉద్యమ నాయకురాలు కవుల సరస్వతి పాల్గొన్నారు.

# సంక్షేమపథకాలు తెలియజేసేందుకు వార్డుసభలు

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య




**ప్రజాపక్షం/శంకర్‌పల్లి :** శంకర్ పల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ప్రజాపాలణ ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జరిగిన వార్డు సభకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలు, అమలులో ఉన్న పథకాల వివరాలను, లబ్ధిదారుల వివరాలు ప్రజలకు తెలియజేయడం కోసం ఈ వార్డు సభలను నిర్వహించడం జరిగిందన్నారు. అధికారులు, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు ప్రజలు తెలిపిన సమస్యలను త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాతా ప్రవీణ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ జూలకంటి శ్వేతా పాండురంగారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ బి.పూర్ణిమ, మున్సిపల్ కమిషనర్ యోగేష్, మున్సిపల్ మేనేజర్ అంజన్ కుమార్, ఆయా వార్డుల కౌన్సిలర్లు ప్రజలు పాల్గొన్నారు.

### విఠలేశ్వర హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే పూజలు



హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఎమ్మెల్యే కాలే యాదయ్య గురువారం శంకర్‌పల్లి పట్టణంలోని శ్రీ విఠలేశ్వర హనుమాన్ దేవాలయానికి చేరుకొని హనుమంతునికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, నాయకులు ప్రకాష్, బెజ్జం రాజేశ్వర్, దండు మోహన్, పార్శి బాలకృష్ణ పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

### పేదోడి సొంతింటి కల నెరవేర్చాలన్నదే లక్ష్యం

**ప్రజాపక్షం/కొత్తూరు:** పేదోడి సొంతింటి కలను నెరవేర్చాలన్నదే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో లబ్దిదారులు నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం చేయించారు. సర్పంచ్ ఎర్రోళ్ల జగన్, తహసీల్దార్ ముంతాజ్‌భేగం, మాజీజడ్పిటిసి మామిడి శ్యాం సుందర్‌రెడ్డితో కలిసి ఇందిరమ్మ గృహప్రవేశాలు చేయించారు. కార్యక్రమంలో మేకగూడ సహకార బ్యాంక్ అధికారి చంద్రకుమార్, బ్యాంక్ పర్సనల్ ఇన్‌చార్జి ప్రియదర్శిని, కార్యదర్శి గౌస్, ఉపసర్పంచ్ శాంతన్‌రెడ్డి, వార్డుసభ్యులు ఎం.భారతమ్మ, కె.రమాదేవి, మంద మాధవి, డి.శారద, అర్బాస్, మైబుజీ, ఆర్.రాములు, కె.వేదాంతచారి, మామిడి భీంరెడ్డి, డీలర్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి గ్రామసభలు



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని ఇబ్రహింపట్నం అర్డిఒ అనంతరెడ్డి తెలిపారు. యాచారం మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో అర్డిఒ మాట్లాడారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందని తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్న గ్రామ సభలో అధికారుల దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గ్రామ సభలో వివరించామన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధరాణి, మండల ప్రత్యేకాధికారి మాధవరావ్, తహసీల్దారు అయ్యప్ప, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగానే అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటిలోని 26వ వార్డులో లబ్దిదారు భీమమ్మ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయించారు. లబ్దిదారు కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలను అంధించి అభినంధించారు. నందిగామ మండలం అప్పారెడ్డిగూడ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం, గ్రామసభలో పాల్గొన్నారు. ఈదులపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో పర్యటన చేసి సభల్లో పాల్గొనడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లను గృహప్రవేశం చేయించారు. పరిగి రోడ్డు హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఫరూక్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లు పల్లెల్లో ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు బచ్చలి నరేష్, కొప్పునూరి ప్రవీణ్, మురళీమోహన్, రాజునాయక్, నాయకులు జమృద్‌ఖాన్, ప్రదీప్, భరత్ లోహటి, నాగమణి, బొట్టురాజు, మంజుల, నాగేష్, లక్ష్మీ, నాగమ్మతోపాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతిపేదవాడికీ ప్రభుత్వ ఫలాలు దక్కాలే

టియుఎఫ్ఐడిసి చల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలందరికీ దక్కాలన్నదే లక్ష్యమని తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్(టియుఎఫ్ఐడిసి) చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం మండలం అమీర్పేట్ గ్రామంలో జరిగిన గ్రామసభ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో చల్లా నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆవుల యాదయ్య, గ్రామ సర్పంచ్ పోతుల మల్లమ్మ, ఉపసర్పంచ్ చేగూరి చంద్రకళ, ఆర్ఐ స్వర్ణ కుమారి, గ్రామ పాలకవర్గం వార్డ్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మానవాళికి ఆదర్శప్రాయం ఆంజనేయుడి జీవితం

షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** సమస్త మానవాళికి ఆదర్శప్రాయం ఆంజనేయ స్వామి జీవితమని షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ అన్నారు. గురువారం చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో జయంతి వేడుకలను నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో స్వామివారి పల్లకి సేవలో ఎసిపి లక్ష్మీ నారాయణతోపాటు పట్టణ సిఐ సీతారాం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలం గౌడ్, వసంతరావు, అన్నారం రఘుగౌడ్, గడ్డమీది రమేష్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.





**కేశంపేట:** అపారమైన శక్తి..అజేయమైన దైర్యానికి ప్రతీకగా ఆంజనేయ స్వామి నిలుస్తారని మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని 15వ వార్డులోని ఆంజనేయ స్వామి దేవాలయంలో జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సాధిక్, జమృద్‌ఖాన్, భక్తులు పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ జడ్పిటిసి పి.వెంకట్‌రాంరెడ్డి, దేవాలయ చైర్మెన్ టంగుటూరి మధుసూదన్‌రావు, శ్రీధర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

